నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ప్రకాశం | బాపట్ల
శనివారం 27 జులై 2024 | పేజీలు 8



నాడు చెత్తపై పన్ను వేస్తే.. నేడు చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి

చంద్రబాబు దూరదృష్టితోనే మిగులు విద్యుత్తు రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

జగన్ అనాలోచిత నిర్ణయాలు, పీపీఏల రద్దుతోనే విద్యుత్ లోటు

తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంపు, సామాన్యులపై అధిక భారం

శాసనమండలిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సభ్యుల ప్రశ్నలకు సమాధానం

# జగన్‌రెడ్డి పాలనలో విద్యుత్తు రంగం అస్తవ్యస్తం

సూర్యప్రతినిధి, ఒంగోలు

నాడు జగన్మోహన్‌రెడ్డి చెత్తపై పన్ను వేస్తే, నేడు చెత్త నుంచి ఉత్పిత్తి చేసిన ఘనత ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. 2014లో చంద్రబాబు నాయుడు నాయ కత్వంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. 2014-2019 మధ్య కాలంలో తీసుకున్న నిర్ణయాలతోనే ఏపీ మిగులు విద్యుత్ రాష్ట్రంగా అవతరించిందని గుర్తు చేశారు. అనంతరం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి

మిగతా 3లో

## మార్కాపురం వైద్య కళాశాలకు
# కేంద్ర పథకం కింద నిధులివ్వాలి

పార్లమెంట్‌లో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి విజ్ఞప్తి

ఒంగోలు, మేజర్‌న్యూస్: మార్కాపురం మెడికల్ కళాశాలను సెంట్రల్ స్కీం కిందకు చేర్చాలని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. శుక్రవారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో ఎంపి మాగుంట మాట్లాడుతూ వైద్య మౌలిక సదుపాయాలు మన సమాజ ఎదుగుదలకు వెన్నెముకని, కొత్త మెడికల్ కాలేజీలు, వైద్యశాలలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అవసరమని తెలిపారు. తదుపరి మాట్లాడుతూ 16-08-2023న నేషనల్ మెడికల్ కమిషన్ వారు 10 లక్షల జనాభాకు 100



మెడికల్ సీట్ల పరిమితి విధించిందని, దీని వలన 13 రాష్ట్రాలు కొత్త వైద్య కళాశాలలు, అదనపు సీట్లు పొందటానికి అవకాశం కోల్పోతాయని, దక్షిణ భారతదేశంలో ఆంధ్ర, తమిళ నాడు, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలు నష్టపోతాయని, ఎన్ఎంసి విధించిన పరిమితిని తప్పక సరిచేయాలని కోరారు. దానికి వైద్య శాఖ మంత్రి సమాధానమిస్తూ దేశంలో 2014లో 387 వైద్య కళాశాలలో 51,348 సీట్లు వుండగా, ప్రస్తుతం దేశంలో 731 వైద్య కళాశాలలో 1,12,112 సీట్లు వున్నాయని, పి.జి సీట్లకు సంబంధించి 2014లో 31,185 సీట్లు వుండగా, ప్రస్తుతం 72,627 సీట్లు వున్నాయని, నాణ్యమైన వైద్య విద్యను మనం

మిగతా 3లో

# వైకాపా ఏకపక్ష దాడులు, దౌర్జన్యాలపై చర్యలు తీసుకోవాలి

డిజిపిని మర్యాదపూర్వకంగా కలసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దంపతులు

దర్శి, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావును దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని డిజిపి ఆఫీస్‌లో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి డాక్టర్ కడియాల లలిత్‌సాగర్‌లు భేటీ అయ్యారు. దర్శి నియోజకవర్గంలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. గత ఎన్నికల్లో వైసిపి ఏకపక్ష దాడులు దౌర్జన్యాలపై ఉన్న పెండింగ్ కేసులపై చర్యలు తీసుకోవాలని



కోరారు. అదే విధంగా దర్శిలో సామాన్య ప్రజానీకానికి ప్రశాంతమైన జీవితం ఉండే విధంగా లా అండ్ ఆర్డర్ తీసుకురావాలని, అందుకు పోలీస్ సిబ్బంది సహకారం అందించాలని కోరారు. నియోజకవర్గంలోని పోలీస్ సిబ్బంది నియామకాలపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. పలు అంశాలపై డిజిపి సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు శాఖాపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని డిజిపి హామీ ఇచ్చినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.



# ఉచిత ఇసుక విధానం ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశం

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఇసుక స్టాక్ పాయింట్ల నిర్వహణ ఖర్చులు తప్ప ప్రజల నుంచి ప్రత్యేకంగా ఇసుక ఛార్జీలు ఏమీ వసూలు చేయడం లేదన్న విషయాన్ని విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్లాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికా రులను ఆదేశించారు. శు క్రవారం అమరావతి సచివాలయం నుంచి గనులు భూగర్భ వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాలలోని ఇసుక లభ్యత - నిల్వలు, రవాణా ఛార్జీలు, ఫిర్యాదులు - పరిష్కార వ్యవస్థపై సమీక్ష నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని పరిస్థితిపై సంబంధిత అధికా



రులతో ఆమె చర్చించారు. నూతన ఇసుక విధానంలో భాగంగా స్టాక్ పాయింట్ల నిర్వహణకు తప్ప ఇసుక కోసం ప్రత్యేకంగా ఎలాంటి

మిగతా 3లో




# ప్రజలకు నమ్మకం కలిగేలా పని చేయాలి

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

ప్రజలతో ముచ్చటించిన జిల్లా ఎస్పీ దామోదర్

జరుగుమల్లి, మేజర్‌న్యూస్: ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా పోలీస్ అధికారులు విధులు చేపట్టాలని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం సింగరాయ కొండ సర్కిల్ పరిధిలో జరుగుమల్లి పోలీస్ స్టేషన్ను జిల్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి నమోదైన కేసులపై ఆరా తీశారు. పెండింగ్ కేసులను త్వరీ తగతిన పూర్తిచేసేలా పోలీస్ అధికారులు కృషి చేయాలన్నారు. స్టేషన్ పరిధిలోని నేరాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. వృత్తి నైపుణ్యత, సాంకేతికత జోడించి మెరుగైన పోలీసింగ్ చేయాలని నిర్దేశించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై ప్రజలకు మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలు అందించాలని సూచనలు చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక శ్రద్ధ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. తొలుత పోలీస్ స్టేషన్ పరిధిలోని లాకప్ గదులు కంప్యూటర్ రూమ్, రికార్డుల నిర్వహణ పోలీస్ స్టేషన్లో క్రైమ్ మ్యాప్‌లను పరిశీలించారు. కాసేపు పోలీస్ సిబ్బందితో ముఖాముఖి మాట్లాడారు. సిబ్బంది చేస్తున్న విధులు వారి సాధక బాధకాలపై ఆరా తీశారు. స్టేషన్ పరిధిలో బీటు తిరిగే సమయంలో చెడు నడత కలిగిన వారిని చెక్ చేయాలన్నారు. వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో విధిగా

మిగతా 3లో

## 29న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలి



భట్టిప్రోలు, మేజర్ న్యూస్: చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న ఆందోళన,నిరసన కార్యక్రమాల్లో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ విజ్ఞప్తి చేశారు.శుక్రవారం భట్టిప్రోలు లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చేనేత సహకార సంఘాలకు గత 11 సంవత్సరాలుగా పాలకవర్గ ఎన్నికలు జరగనందున ఆయా సహకార సంఘాల లోని కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించలేని దుస్థితిలో ఉన్నందున తక్షణమే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి గత కొన్ని సంవత్సరాలుగా సహకార సంఘాలకు రాయితీల రూపంలో ప్రభుత్వం చెల్లించవలసిన రూ 106 కోట్లను చెల్లించి,సహకార సంఘాల పురోభివృద్ధికి తోడ్పడాలని,నేతన్న నేస్తాన్ని రూ 24 వేల నుంచి రూ 36 వేలకు పెంచి మగ్గం నేసే ప్రతి చేనేత కార్మికునికి,ఉపవృత్తిలో నున్న చేనేత కార్మికులకు వర్తింపజే యాలని తదితర సమస్యల పరిష్కారం కోరకు జరుగుచున్న ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బాలాజీ కోరారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు,చేనేత కార్మి కులు కే.వీరమోహనరావు, డోకుపర్తి రామారావు,ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలు పారిశుధ్యంపై అవగాహన కలిగి ఉండాలి:ఎంపీడీవో




చెరుకుపల్లి, మేజర్న్యూస్: గ్రామ పంచాయతీ వీధులు అన్ని శుభ్రంగా ఉండాలి అంటే గ్రామ ప్రజలు పారిశుధ్యం పై ఆహనా పెంచుకోవాలని మండల అభివృద్ధి అధికారి ఏ శ్రీనివాస్ మూర్తి అన్నారు. శుక్రవారం పారిశు ధ్య వార్షికోత్సవ కార్యక్రమం చెరుకుపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీడీవో పాల్గొని గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి పారిశుధ్యం పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం ఆర్ కె మూర్తి, మల్లాది రామకృష్ణ, నాగులు పున్నారావు, దివి రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు, వి శ్రీనివాసరావు, దివి శ్రీనివాసరావు, అవ్వరు రామారావు, కుంభ శివయ్య, ఏనుగుల కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణ, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెల్లటూరు పాఠశాలలో శిక్ష సప్తాహా



భట్టిప్రోలు, మేజర్న్యూస్: భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్ష సప్తాహా కార్యక్రమం శుక్రవారం ఎంఈఓ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా డే-6 లో నూతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పాఠాలను ఎలా బోధించాలి, ట్యాబు లను విద్యార్థులు ఎలా ఉపయోగించాలి అదేవిధంగా ఐ ఫ్ టి ప్యానల్ ఉపయోగించి పాఠాలు ఎలా బోధించాలో మండల విద్యాశాఖ అధికారి-2 దేవరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"21 వ శతాబ్దంలో విద్యాబోధనలో నూతన సాంకేతిక పరిజ్ఞానం అనేది చాలా కీలకమైనదని, ఉపాధ్యాయులందరూ నూతన బోధన పద్ధతుల ద్వారా బోధించాలని అన్నారు."ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె అరుణ కుమారి,గుర్రం మురళీ మోహన్ త దితరులున్నారు.

## రాజధాని, శాంతి భద్రతలు లేని రాష్ట్రంగా చేశాడు జగన్: చేజర్ల సతీష్



బాపట్ల మేజర్ న్యూస్: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ నాయకులు చేజర్ల సతీష్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. సతీష్ మాట్లాడుతూ జగన్ ఢిల్లీకి వెళ్లి ధర్నా చేసారని అది ధర్నాలా లేదని డ్రామాలు ఆడేందుకు వెళ్లినట్టు ఉందని ఎద్దేవా చేశారు. వాళ్లు వాళ్లు కొట్టుకుని, చంపు కొని కూటమిపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎక్కడ చనిపోయారో పేర్లతో పాటు 24 గంటల్లో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రజలు ఇచ్చిన దెబ్బకు జగన్‌కు మైండ్ పోయిందని అన్నారు. రాష్ట్రంలో విధ్వంస పాలన చేశారని, ఏపీని సర్వ నాశనం చేశారని, శాంతి భద్రతలు లేని రాష్ట్రంగా మార్చేసారని దుయ్య బట్టారు. ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని, జగన్ పాలనపై నమ్మకం లేకనే ప్రజలు ఇంటికి పంపారని అన్నారు. జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లలో ప్రజలపై జరిగిన దాడులను లోకమంతా చూసిందని చేజర్ల సతీష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆందోళన ప్రదేశ్‌గా మార్చిన ఘనత, రాజధాని లేకుండా చేసిన ఘనత జగన్‌కే దక్కిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చిన తర్వాతే రాష్ట్రంలో శాంతి వాతావరణం నెలకొందని తెలిపారు. కక్ష సాధింపులు కాదని అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌వైపు అడుగులు వేస్తుందని ఆయన అన్నారు.

## వేజెండ్ల శ్రీనివాస్ సౌజన్యంతో పౌష్టికాహార పంపిణీ



బాపట్ల టౌన్, మేజర్న్యూస్: రోటరీ క్లబ్ అఫ్ బాపట్ల వారి ఆధ్వర్యంలో రోటరీ గవర్నర్ వారి ఆదేశాల మేరకు బాపట్ల పట్టణంలోని వివేకానంద కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్‌సెంటర్లో శుక్రవారం గర్భిణీ, బాలింత మహిళ లకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ, బాలింత మహిళలకు రోటరీ క్లబ్ అఫ్ బాపట్ల కార్యదర్శి, బాపట్ల ప్రెస్‌క్లబ్, ముఖ్యదాత(స్పాన్సర్)వేజెండ్ల శ్రీనివాసరావు సౌజన్యంతో 30 మందికి పౌష్టికాహారం అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అఫ్ బాపట్ల అధ్యక్షులు కోళ్లపూడి ఉపేంద్ర గుప్తా, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జిట్టా శ్రీనివాసరావు, ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్, యూనివర్సిటీ హెడ్ జాగర్లమూడి లక్ష్మీ పాల్గొని బాలింత మహిళలకు ఆరోగ్య సంరక్షణ గురించి అనేక విషయాలు తెలిపారు. అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ త్రివేణి బాలింతల ఆరోగ్యం గురించి వివరించారు. సీనియర్ రోటరీ క్లబ్ బాపట్ల సభ్యులు ఈ.హరిబాబు, ఎస్ రమేష్ బాబు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కొల్లా శ్రీనివాసరావు, ప్రొఫెసర్ వీరరాఘవయ్య, కొత్త ఆంజనేయ వరప్రసాద్, షేక్ మస్తాన్, బొట్టు కృష్ణ పాల్గొన్నారు.

## దేశ ప్రజలకు కార్గిల్ విజయ్ దివాస్ శుభాకాంక్షలు తెలిపిన తాంద్ర

బాపట్లటౌన్, మేజర్న్యూస్: పట్టణంలోని విజయలక్ష్మిపురంలోని బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు జిల్లా అధ్యక్షులు తాంద్ర సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా జరపబడ్డాయి. ఈ సందర్భంగా తాంద్ర సాంబశివరావు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా భారతీయులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ సైనికుల వీరోచిత పోరాటాల ఫలితమే కార్గిల్ యుద్ధ విజయమని ఎంపీటీసీ తాంద్ర సాంబశివరావు కొనియాడారు. అనంతరం బాపట్ల పట్టణ పురవీధులలో బాపట్ల జిల్లా మాజీసైనిక సంక్షేమ సంఘం సభ్యులు మువ్వన్నెల జెండాల తో కార్గిల్‌విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, భారతమాతకు జేజేలు పలికారు. కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ సెక్రటరీ సయ్యద్ అఖిల్, జాయింట్ సెక్రటరీ ఆసోది రామకృష్ణ రెడ్డి, ట్రెజరర్ పువ్వాడ యల్లమంద, ఉమ్మడి గుంటూరు జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరిరావు, సీనియర్ మాజీ సైనికులు అబ్దుల్ రజాక్, మేకా ఏడుకొండలరావు, అబ్దుల్ రెహమాన్, ఏమినేని సురేంద్ర, రుక్మదర రావు, డి వెంకటేశ్వర్లు, పసుపులేటి ప్రసాద్, పి రాధా కృష్ణ మూర్తి, కే ఆంజనేయులు, రాంప్రసాద్ రెడ్డి, బసివి రెడ్డి, వెంకట కృష్ణా రెడ్డి, ఆడే కిషోర్, మహిళా సభ్యులు ఆడే రాఘవా దేవి, తిరుపతమ్మ మొదలగు మాజీ సైనికులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## మండల నూతన తహసిల్దార్‌గా సిహెచ్.పద్మావతి



చెరుకుపల్లి, మేజర్ న్యూస్: మండల తహసిల్దార్ గా చక్రవరం పద్మావతి శుక్రవారం నూతన బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల లో భాగంగా ఆర్డిఓ ఆఫీసు నుండి బదిలీపై చెరుకుపల్లి మండలం తహసిల్దార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటు లో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కార చేస్తామని ఆమె అన్నారు. బాధ్యతలు స్వీకరించిన పద్మావతికు రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

### నూతన తహసిల్దార్‌కు అభినందనలు తెలిపిన మండల రేషన్ డీలర్స్



నూతనంగా మండల తహసిల్దార్ సిహెచ్ పద్మావతి బాధ్యతలు స్వీక రించిన సందర్భంగా శుక్రవారం మండల రేషన్ డీలర్ల అధ్యక్షులు నాగుల పున్నారావు ఆధ్వర్యంలో మండల రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు అభినందనలు తెలిపారు. టి రవిచంద్రరెడ్డి, కుమ్మూరు కృష్ణ, వెంకటేశ్వరరావు, సురేష్, దేవలరావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక రెస్క్యూ టీం చొరవతో రోడ్డుపై పడిన చెట్టు కొమ్మ తొలగింపు



బాపట్ల టౌన్, మేజర్ న్యూస్: బాపట్ల పట్టణం డిఎస్పీ కార్యాలయం వద్ద ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని 40 సంవత్సరాల ఆయుషు కలిగిన అగ్గిపుల్ల చెట్టు కొమ్మ బొగిలిపోయి రహదారిపై కూలిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండ డంతో బాపట్ల జిల్లా అగ్నిమాపక అధికారి ఆదేశాల మేరకు ఫైర్ ఆఫీసర్ వై వెంకటేశ్వరరావు, ఫైర్ మాన్ శ్రీనివాసరావు, నాగయ్య, భరత్‌రెడ్డి విధులలో పాల్గొని కటింగ్ యంత్రాల సాయంతో చెట్లను ముక్కలుగా చేసి తొలగించారు. చెట్టును తొలగించిన అగ్నిమాపక అధికారులకు ఆ రహదారిలో ఉన్న నివాసాల ప్రజలతో పాటు వాహనదారులు కూడా కృతజ్ఞతలు తెలిపారు.

## 29న ఆవుల యజమానులతో కమిషనర్ సమావేశం

బాపట్ల, మేజర్ న్యూస్:బాపట్ల పురపాలక సంఘ పరిధిలో రోడ్లుపై ఆవుల సంచారము అధికముగా ఉండుటవలన రోడ్డు మీద వెళ్లు వాహనదారు లకు, పాదచారులకు ఆటంకము, ప్రాణనష్టము, ప్రమాదములు పారిశు ధ్యమునకు ఇబ్బందికరంగా వుండుట వలన ఆవులను పట్టణ పరిధి లోని రోడ్ల మీదకు వదిలివేయరాదని మైకు ద్వారా కరపత్రముల ద్వారా అనేక పలుమార్లు మీటింగుల ద్వారా తెలియజేశారు. బాపట్ల పురపాలక కార్యాలయం నుండి ఆవుల యజమానులకు అనేక పర్యాయములు నోటీసులు జారీ చేశారు. కావున ఈనెల 29న అనగా సోమవారం సాయ ంత్రం 04.00 గం.లకు ఆవుల యజమానులతో పురపాలక సంఘ కార్యాల యములో సమావేశం ఏర్పాటు చేశారు. కావున సదరు సమావేశమునకు బాపట్ల పట్టణ పరిధిలోని ఆవుల యజమానులు తప్పనిసరిగా హాజరు కావలెను అని ఆదేశించారు.

## ఘనంగా ప్రగడ కోటయ్య 109వ జయంతి వేడుకలు



చెరుకుపల్లి, మేజర్న్యూస్: చేనేత రంగం అభివృద్ధి చెందింది అంటే ప్రజా బంధు ప్రగడ కోటయ్య కృషి వలనే అని ఆరంబాక వివర్స్ సొసైటీ అధ్య క్షులు దివి రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయం వద్ద ప్రగడకోటయ్య 109వజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ ప్రగడ కోటయ్య కృషి వాళ్ళనే ఆనాడు ఆంధ్రాలో చేనేత సహకార సంఘాలు ఏర్పడ్డాయి, చేనేత కార్మికులకు కావలసినంత నూలు సరఫరా చేయాలని, నూలు ధరలు అదుపులో పెట్టాలని, నూలు ఎగుమతులు ఆపాలని ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సాయి రాజేంద్ర సొసైటీ అధ్యక్షుడు దివి శ్రీనివాసరావు, కందుల వెంకటేశ్వరరావు, ఆవారు రామారావు, వంగర చక్రవర్తి, అంది సాంబశివరావు, కందుల రామ్మోహన్రావు, పట్టు వెంకటేశ్వరరావు , కౌతలపు వెంకట సుబ్బారావు, వంగర శ్రీనివాసరావు, మాచర్ల బ్రహ్మం, బట్టు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం వైద్య కళాశాలకు కేంద్ర పథకం కింద నిధులివ్వాలి

**మొదటి పేజీ తరువాయి** అందించడంతో ప్రపంచదేశాలలో మన డాక్టర్లు పేరుగాంచడం మనకు గర్వకారణమన్నారు. ఎన్ఎంసి విధించిన పరిమితిపై సంబందిత రాష్ట్రాలతో మాట్లాడి తగు నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలియజేశారు. గత రాష్ట్ర ప్రభుత్వ కాలంలో 17 వైద్య కళాశాలలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారని, కానీ వాటిలో సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీం కింద 3 కళాశాలు మాత్రమే తీసుకున్నారని, ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని మార్కాపురంలో వైద్య కళాశాల నిర్మాణంలో వుందని, 2024-25 కేంద్ర బడ్జెట్‌లో ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించిన దృష్ట్యా ఈ కళాశాలను సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీం కిందకు తీసుకురావాలని కోరారు. దానికి మంత్రి సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆలిండియా మెడికల్ సైన్సెస్‌ను ప్రారంభించబోతున్నామని కేంద్రమంత్రి తెలియజేశారు.

## ఉచిత ఇసుక విధానం ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**మొదటి పేజీ తరువాయి** రుసుము వసూలు చేయడం లేదన్న విషయంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. స్టాక్ పాయింట్ నుంచి ఒకే ప్రదేశానికి సరఫరాలో రవాణా ఛార్జీల పరంగా వ్యత్యాసం లేకుండా త్వరలోనే ట్రాన్స్పోర్టర్లతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కాగా ప్రస్తుతం జిల్లాలో 26 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు అధికారులు ఆమెకు వివరించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్.ఈ మురళీ మోహన్, డి.టి.సి సుశీల, ఒంగోలు ఆర్.డి.ఓ జి.వి సుబ్బారెడ్డి, గనుల శాఖ నుంచి రాయల్టీ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు నమ్మకం కలిగేలా పని చేయాలి

**మొదటి పేజీ తరువాయి** పర్యటించాలని ప్రజలతో సంబంధాలు కలిగి ముందస్తు సమాచారం సేకరించాలని తెలిపారు. మహిళలు పిల్లలు సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పోలీస్ శాఖపై నమ్మకం పెంపొందించేలా సేవలు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీతో పాటు సింగరాయకొండ సిఐడి రంగనాథ్, జరుగుమల్లి ఎస్సై వి.వెంకటేశ్వరరావు పోలీస్ సిబ్బంది చక్రవర్తి చిన్న పాల్గొన్నారు. అయితే జరుగుమల్లి గ్రామ ప్రజలతో జిల్లా ఎస్పీ కాసేపు గ్రామాల్లో సమస్యలు ప్రజల సమస్యలు శాంతి భద్రతలపై నమ్మకం కలిగించేలా వారికి అవగాహన కల్పించారు.

## దర్శి వైసిపికి ఎదురు దెబ్బ

### టిడిపిలోకి ముండ్లమూరు మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, జడ్పీటిసీలు నేడు ఇన్‌చార్జ్ డా. గొట్టిపాటి లక్ష్మీ సమక్షంలో తెదేపా తీర్థం

దర్శి, మేజర్‌న్యూస్: దర్శి నియోజకవర్గంలో వైసిపికి ఎదురు గాలి మొదలైయ్యింది. ఎమ్మెల్యే టిక్కెట్‌ను కైవసం చేసుకున్నప్పటికీ టిడిపి హవా ఏ మాత్రం తగ్గలేదు. టిడిపి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సారథ్యంలో టిడిపి జెండా నియోజకవర్గంలో రెపరెపలాడుతోంది. ఈ క్రమంలో వైసిపిలోని ముఖ్య నేతలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు టిడిపిలోకి వచ్చేందుకు బాటలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో ముండ్లమూరు మండలంలోని కొందరూ సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, జెడ్పీటిసీలు వైసిపికి గుడ్ బై చెబుతున్నారు.

నేడు టిడిపిలోకి చేరుతున్నట్లు ప్రకటించారు. దర్శి ఎల్పి రోడ్డులోని ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి నివాసంలో వైసిపి శ్రేణులు, ప్రజాప్రతినిధులు టిడిపి తీర్థం పుచ్చుకోనున్నారు. నేడు సాయంత్రం జరిగే ఈ కార్యక్రమానికి ముండ్లమూరు మండలంలోని టిడిపి ముఖ్య నేతలు, అలాగే జనసేన, బిజెపి నేతలు రావల్సిందిగా దర్శి పార్టీ కార్యాలయం నుండి పత్రికా ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు.

# అర్హులందరికి ప్రభుత్వ సేవలు అందేలా చూడాలి

### ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి - జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశం

ఒంగోలు, మేజర్‌న్యూస్:క్షేత్రస్థాయిలోనే ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు లబ్దిదారులకు అందేలా మరింత దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శుక్రవారం ఆమె ప్రకాశం భవనంలోని తన ఛాంబర్‌లో జిల్లాపరిషత్, గ్రామ, వార్డు సచివాలయాలు, ప్రణాళిక, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా అమలుజేస్తున్న పథకాలు, పౌర సేవల పురోగతిపై ఆమె ఆరా తీశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఇస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువతకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల గురించి తెలియజేయడంతో పాటు వాటి పొందేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వడంలో ఉపాధికల్పన, నైపుణ్యాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ చెప్పారు.

గ్రామీణ ప్రాంతాల మౌలిక సదుపాయాలపై జిల్లా పరిషత్ అధికారులు మరింత దృష్టి సారించాలని ఆమె అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సి.ఈ.ఓ మాధురి, డిప్యూటి సి.ఈ.ఓ హనుమంతరావు, డి.పి.ఓ, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ ఉషారాణి, మార్కాపురం జిల్లా ఉపాధి కల్పనా అధికారి భరద్వాజ్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజ, సి.పి.ఓ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# తప్పుడు దృవపత్రాలు పెట్టి ఉద్యోగాలు చేస్తున్న ల్యాబ్ టెక్నిషియన్లపై చర్యలు తీసుకోవాలి

### రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రికి సుజన్ మాదిగ వినతి

ఒంగోలు, మేజర్‌న్యూస్: 2020 ల్యాబ్ టెక్నీషియన్ నోటిఫికేషన్‌లో తప్పుడు దృవపత్రాలు పెట్టి ఉద్యోగం చేస్తున్న వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ తెలిపారని మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో మంత్రిని సుజన్ మాదిగ మర్యాదపూర్వకంగా కలిసి వినతి రూపంలో విషయాన్ని వివరించారు. మంత్రితో సుజన్ మాదిగ మాట్లాడుతూ 2020 నోటిఫికేషన్‌లో 30 మందికి గాను 22 మంది తప్పుడు సర్టిఫికెట్లు పెట్టీ ఉద్యోగం చేస్తున్నారని, వారిపై ఈరోజు వరకు ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారు అనేక సందర్భాల్లో ఆధారాలతో సహా ఇచ్చినప్పటికీ, చర్యలు తీసుకోలేదని దీనిలో వైద్య ఆరోగ్య శాఖ వారికి కూడా ప్రమేయం ఉందని మంత్రితో అన్నారు. అదే విధంగా 22 మంది గాను కేవలం ఒకరిని



మాత్రమే టెర్మినేట్ చేశారని, మిగతా వారిపై ఈరోజు వరకు కూడా చర్యలు తీసుకోలేదని మంత్రితో అన్నారు. దానికి మంత్రి పది రోజుల్లోపే వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.



# క్యాన్సర్ రోగికి రెడ్ క్రాస్ సాయం

### - జిల్లా కలెక్టర్ అన్సారియా చేతుల మీదగా చెక్కు అందజేత

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఒంగోలు మండలం గుండమాల గ్రామానికి చెందిన సింగోతు కోటేశ్వరరావు గత రెండు సంవత్సరాలుగా కేన్సర్ వ్యాధితో బాధపడున్నారు. ఇది నాల్గవ స్టేజీకి చేరింది. గుంటూరులో రేడియేషన్ చికిత్స చేసినా ఫలితం రాలేదు. హైదరాబాద్‌లోని పునర్జన్ ఆయుర్వేద ఆస్పత్రిలో గత రెండు నెలలుగా మందులు వాడడంతో కొంత ఉపశమనం కలిగింది. కానీ నెలకు ఇరవై వేలరూపాయల వరకూ కావల్సిరావడంతో రోజు కూలీ పనికి వెళ్లే భార్య సంపాదనతో జీవించే తనకు గత్యంతరం లేక గత సోమవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి తన గోడును చెప్పుకొన్నారు. తక్షణం స్పందించిన కలెక్టర్ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ మాంటిస్సోరి ప్రకాష్‌ను కేన్సర్ రోగికి సహాయం అందించవలసిందినంగా కోరారు. దీనితో 45 రోజులకు సరిపడా మందులకు రూ.20వేల చెక్కును కలెక్టర్, రెడ్ క్రాస్ అధ్యక్షురాలైన తమీమ్ అన్సారియా చేతుల మీదగా రోగి భార్యకు శుక్రవారం ప్రకాశం భవనంలో అందచేశారు. తక్షణం స్పందించిన రెడ్ క్రాస్ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్ బాబు, ఏ.ఓ.సుధాకర్‌రావు, అడ్మిన్ శ్రీనివాస రావు పాల్గొన్నారు.


**పోయినవి**

ప్రకాశం జిల్లా, పెద్ద దోర్నాల మండలంలోని కడపరాజుపల్లి గ్రామానికి చెందిన బొప్పురి లాజర్ తండ్రి రాజేంద్రప్రసాద్ అను నేను 2024 జూన్ నెల 10వ తేదిన కడప రాజు పల్లి నుంచి పెద్ద దోర్నాల ఆటోలో వెళుతుండగా బ్యాగ్ జారి క్రింద పడి పోయింది. ఎంత వెతికినా కనిపించలేదు. అందులో వివి 216405 సీరియల్ నెంబర్ గల పదో తరగతి ఒరిజినల్ మార్కుల లిస్టుతో పాటు టీసీ కూడా ఉంది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలుపగలరు.

**ఇట్లు**
**బొప్పురి లాజర్ తండ్రి రాజేంద్ర ప్రసాద్, కడపరాజుపల్లి గ్రామం, పెద్దదోర్నాల మండలం, ప్రకాశం జిల్లా. సెల్ నెంబర్లు: 9666514764, 9133409582.**


# జగన్‌రెడ్డి పాలనలో విద్యుత్తు రంగం అస్తవ్యస్థం

**మొదటి పేజీ తరువాయి**రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని అస్తవ్యస్థంగా మార్చిందని పేర్కొన్నారు.

### అనాలోచిత నిర్ణయాలతో ప్రజలపై భారం

'2013-2014 సమయాల్లో తీవ్రమైన కరెంట్ కోతలు ఉండేవి. రాత్రిపూట విద్యుత్ వినియోగిస్తే జరిమానాలు విధించే వారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, పాలసీలను రద్దు చేయడం వల్ల విద్యుత్ లోటు ఏర్పడింది. రోజురోజుకు విద్యుత్ వినియోగం పెరుగుతున్నా కానీ ప్రజావసరాలకు కావాల్సినంత విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలం అయ్యింది. ఫలితంగా వినియోగదారులపైన భారం పడింది. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచింది. ఈ నిర్ణయంతో నష్టపోయింది ఎక్కువగా పేద, మధ్య తరగతి కుటుంబాలే. 2014-19 లో 50 యూనిట్లు కాల్చే వారికి రూ.100 కరెంట్ బిల్లు వస్తే 2019-24 మధ్య కాలంలో రూ.199 పెరిగి 98 శాతం భారం వారి మీద పడింది. 100 యూనిట్లు వినియోగించే వారిపై 86 శాతం, 200 యూనిట్లు వినియోగించే వారిపై 78 శాతం భారం పడిందని తెలిపారు.

### బాబు ముందు చూపుతూనే మిగులు విద్యుత్

2014-19 మధ్య కాలంలో చంద్రబాబు నాయుడు ముందు చూపుతో విటీపీఎస్, కృష్ణపట్నంలో 800 మెగావాట్ల ఉత్పత్తికి పవర్ ప్లాంట్లు పెట్టినట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మండలిలో తెలిపారు. వాటిని సరిగా వినియోగించుకోలేకపోవడం కారణంగా రూ. 4000 కోట్లు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ను సకాలంలో అందుబాటులోకి తీసుకుని వచ్చి ఉంటే అదనంగా 960 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చేదని అన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్లే 960 మెగావాట్ల విద్యుత్‌ను ఏపీ ప్రజలు కోల్పోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.

### సమర్థునికి, అసమర్థునికి అదే తేడా

టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు రెన్యువబుల్ ఎనర్జీని ప్రోత్సహించారు. సోలార్, విండ్ ఎనర్జీల ద్వారా 6500 నుంచి 7500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకుని వచ్చారు. గత ప్రభుత్వం తీసుకున్న పీపీఏల రద్దు నిర్ణయం కారణంగా ఒక్క మెగావాట్ విద్యుత్ కూడా ఉత్పత్తి కాలేదు. జగన్ ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేఖిస్తూ విదేశీ సంస్థలు కేంద్రానికి పలుమార్లు లేఖలు రాశాయి. తక్కువ రేటుకు లభించే విద్యుత్ ను వదులుకుని, రెట్టింపు రేటుకు విద్యుత్‌ను కొనుగోలు చేసింది జగన్ ప్రభుత్వం. ఒక అసమర్థుడు ఐదేళ్లు పరిపాలిస్తే విద్యుత్ వ్యవస్థ ఎంత అథోపాతాళానికి చేరుతుందో జగన్ మోహన్ రెడ్డి నిరూపిస్తే ఒక సమర్థవంతుడు ఐదేళ్లు పరిపాలిస్తే మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరూపించారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివరించారు.

## వెలిగొండ ప్రాజెక్టును సందర్శించిన డోన్ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి







పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కొత్తూరు గ్రామ సమీపంలో గల వెలిగొండ ప్రాజెక్టును డోన్ శాసనసభ్యుడు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలను పరిశీలించారు. అక్కడున్న అధికారులతో వెలుగొండ ప్రాజెక్ట్ మ్యాపును పరిశీలించారు. ముందుగా దోర్నాల మండలం తెదేపా కన్వీనర్ బి.మల్లికార్జున రెడ్డి, రాష్ట్ర టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్ రెడ్డి, కొప్పుల సుబ్బారెడ్డి, కడిమెట్ల శ్రీనివాస యాదవ్ ఆయనకు ఘన స్వాగతం పలికారు.

## నన్ను కలవడానికి వచ్చేవాళ్ళు పూలు, శాలువాలు తేవద్దు

### టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి



దర్శి, మేజర్‌న్యూస్: తనను కలవడానికి వచ్చే కార్యకర్తలు, నాయకులు, అభిమానులు శాలు వాలు, పూల బొకేలు తీసుకు రావద్దు అని, తన మాట మన్నించి వాటి స్థానంలో విద్యార్థులకు ఉపయోగ పడేలా పుస్తకాలు తీసుకు వచ్చినందుకు హృదయ పూర్వక ధన్యవాదములు అని దర్శి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. అదే విధంగా ఎంత మంది పిల్లలు న్నా తల్లికి వందనం ఇస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు మళ్ళీ జరగకూడదు అనేది తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అర్హులు ఎంత మంది ఉన్నా ఒకొక్కరికి రూ.15వేలు ఇస్తామన్నారు. ప్రభుత్వంతోపాటు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు పథకం వర్తిస్తుందని గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.

## పెనుగంచిప్రోలులో మొక్కులు తీర్చుకున్న తెదేపా నేతలు

అద్దంకి, మేజర్ న్యూస్: అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మరియు క్లస్టర్ ఇంచార్జ్ కుందారపు రామారావు (చిన్న రాముడు) మిత్ర బృందం గురువారం రాత్రి ప్రత్యేక వాహనంలో బయలుదేరి వెళ్లి పెనుగంచిప్రోలు లో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారినీ శుక్రవారం దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ కూటమి రాష్ట్రంలో 164, అసెంబ్లీ సీట్లలో మరియు 21 పార్లమెంట్ సీట్లలో అత్యధిక భారీ మెజారిటితో విజయ డంకా మోగించి అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గంలో గౌరవ శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. ఐదవ సారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో అడుగు పెట్టడమే కాకుండా రాష్ట్ర మంత్రివర్గంలో అద్దంకి నియోజకవర్గం నుండి ఇప్పటి వరకు ఎవరికీ దక్కని అవకాశం తొలిసారిగా విద్యుత్ శాఖ మాత్యులు గా పదవి చేపట్టిన సందర్భముగా మొక్కుబడులు చెల్లించుకుంటున్నట్లు క్లస్టర్ ఇంచార్జ్ కుందారపు రామారావు తెలిపారు.తన శాఖ ద్వారా రాష్ట్రంలో మరేన్నో



అభివృద్ధి పనులు చేయడంతో పాటు అద్దంకి నియోజకవర్గాన్ని కూడా ఎన్నడూ లేని విధంగా ఇంకా మరింత అభివృద్ధి చేయాలని భక్తి శ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అదిరోహించాలి

### ఎస్సై బాజిరెడ్డి



ఉలవపాడు, మేజర్‌న్యూస్: కెరీర్ గైడెన్స్‌లో భాగంగా స్థానిక జి.వి.ఎస్.ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఎస్ఐ ఏ.బాజి రెడ్డి విద్యారు థ్లను శుక్రవారం మోటివేట్ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే మత్తు పానీయాలు, గంజాయి, ధూమపానం తదితర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని,సెల్ ఫోన్స్ కళాశాలకు తీసుకురావద్దని, సెల్ ఫోన్ కు ఎడిక్ట్ అయితే జీవితాలు నాశనంఅవుతాయని ఆయన చెప్పారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవిం చాలని కెరీర్‌లో మంచి లక్ష్యాలను నిర్ణయించుకుని వాటిని అందుకునే వరకు ప్రయత్నం చేయాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి గోపీ చంద్ ప్రకాష్, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ మహమ్మద్ రఫీ, లైబ్రరీ అధ్యాపకులు హనుమంతరావు పాల్గొన్నారు. అనంతరం అధ్యాపక బృందం ఎస్ఐని శాలువాతో సత్కరించారు.

## ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి మాపై నిందలా?

### టిడిపి నాయకులు

కందుకూరు, మేజర్‌న్యూస్: ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షెడ్డును అధికారులు తొలగిస్తే టిడిపి వర్గీయులపై ఆరోపణలు చేయడం వైకాపా నాయకుల హేయమైన పని అని లింగసముద్రం పంచాయితీ టిడిపి అధ్యక్షులు గాలంకి ప్రసాదు,మండల తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య, మండల తెలుగు రైతు అధ్యక్షులు మద్దెల రామారావు పేర్కొన్నారు. లింగసముద్రంలోని స్థలం వివాదానికి సంబంధించి వైసీపీ నేతల ఆరోపణ అంతా అబద్ధమే అని తెలిపారు. వాస్తవానికి 77 వ సర్వేనెంబరులోని 89 సెంట్లు భూమి ప్రభుత్వ రికార్డుల్లో రోడ్డు పోరంబోకు భూమిగా నమోదై ఉంది. ఖాళీగా ఉన్న ఈ స్థలంపై కన్నేసిన మండల వైసిపి నాయకుడు వరికూటి కృష్ణారెడ్డి రాత్రికి రాత్రి ఆ స్థలంలో అక్రమంగా షెడ్డు నిర్మించాడు. గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న పంచాయితీ కార్యదర్శి, పోలీసుల సహాయంతో, గ్రామస్తుల సమక్షంలోనే శుక్రవారం ఉదయం షెడ్డును తొలగించారు. ఈ క్రమంలో సదరు వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి, మరి కొంతమంది అనుచరులను వెంటేసుకొని, ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించేందుకు ప్రయత్నించాడు. స్థానికులను కూడా భయభ్రాంతులకు గురి చేశాడు. చివరకు పోలీసులు జోక్యం చేసుకొని కృష్ణారెడ్డిని అడ్డుకొని పంపించేశారు. కానీ ఈ వివాదాన్ని, తమకు అనుకూలంగా మలుచుకునేందుకు వైసిపి నేతలు ప్రయత్నించటం సిగ్గుచేటు అన్నారు. ఈ వ్యవహారంతో ఆర్యవైశ్యులకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదు. గడిచిన 5 ఏళ్లలో నిత్యం అక్రమాలకు పాల్పడి, తెలుగుదేశం నాయకులను టార్గెట్ చేసి మరీ వేధించిన వరికూటి కృష్ణారెడ్డి బాగోతం లింగసముద్రం మండల ప్రజలందరికీ బాగా తెలుసునని ఇప్పుడు తామేదో నీతిమంతులైనట్టు నటించినా ఎవరూ నమ్మరని గుర్తుపెట్టుకుంటే మంచిది హితవు పలికారు.



## ఇంచార్జి తహసీల్దార్ దాస్‌ను కలిసిన టిడిపి నేతలు

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: నూతనంగా ఇంచార్జి తహసీల్దార్ భాద్యతలు స్వీకరించిన కె.దాసును తెదేపా నాయకులు శుక్రవారం కార్యాలయంలో కలిసి శాలువాలతో, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు, కడిమెట్ల శ్రీనివాస్ యాదవ్, ఎస్కే బాషా, శేఖర్ బాబు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.





## మంత్రులను కలిసిన విభిన్న ప్రతిభావంతులు

దర్శి, మేజర్‌న్యూస్: రాష్ట్ర మంత్రులను టిడిపి రాష్ట్ర విభిన్న ప్రతిభవంతులు సంఘ నాయకులు శుక్రవారం కలిశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చం నాయుడు, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు లను సెక్రటేరియట్ నందు మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర టిడిపి దివ్యాంగుల సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీ సందు వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని అలాగే నీటిపారుదల వ్యవసాయ రంగాలలో పురాభివృద్ధి సాధిస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గ అధ్యక్షులు పూసల ఓపయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలో ఏర్పాటుచేసిన షెడ్డు తొలగింపు



లింగసముద్రం, మేజర్‌న్యూస్: ప్రభుత్వ స్థలంలో రాత్రికి రాత్రి జరిగిననిర్మానాలను స్థానికులు అడ్డుకోవడంతో వివాదం నెలకొనింది. వైకాపాకుచెందిన వరికూటి కృష్ణారెడ్డి అను అతను లింగసముద్రంలోని కొత్తసినిమాహాల్ సమీపంలో రోడ్డు పోరంబోకు స్థలంలో షెడ్డు ఏర్పాటు చేశాడు. దీంతో స్తానికులు నిర్మాణాన్ని తొలగించాలని ఆందోళనకు దిగడంతో వివాదం జరిగి ఉద్రిక్తత నెలకొనింది. పంచాయతీ, రెవిన్యూ,పోలీస్ అస్థాలానికి చేరుకొని అక్రమంగా నిర్మించిన షెడ్డును తొలగించారు.

## తెదేపా కార్యకర్తలపై పెట్టిన అక్రమకేసులను ఎత్తేయాలి



వెలిగండ్ల, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2019 మే నెల నుండి 2024 జూన్ నెల వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అధికారాన్ని అడ్డంపెట్టుకొని పోలీసుల చేత తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును శుక్రవారం విజయవాడలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పందించిన అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ (జగన్ మోహన్ రెడ్డి) ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రతాప్ కుమార్ మీడియా దృష్టికి తీసుకొచ్చారు. అధ్యక్షులను కలిసిన వారిలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్ కుమార్, నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కరేడు విద్యార్థులు





ఉలవపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి జంప్ రోప్ (స్కిప్పింగ్) పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రామిశెట్టి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు.ఈనెల మొదటి వారంలో కరేడు జిల్లా పరిషత్ పాఠశాలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జంప్ రోప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో 8వ తరగతి చదువుతున్న తాటిపర్తి ఉపదేష్ అండర్-14లో, 5వ తరగతి చదువుతున్న కొక్కిలిగడ్డ వర్షిత అండర్-12 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారు. వీరు ఈనెల 27, 28 తేదీల్లో నంద్యాలలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఓగుబోయిన శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు, స్టాఫ్ సెక్రటరీ కే.కృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.



## ప్రధానికి రైతులు ధన్యవాదాలు

దర్శి, మేజర్‌న్యూస్: రాష్ట్రంలోని రైతులు అదనంగా పండించిన పొగాకు అమ్మకాలను అదనపు రుసుము లేకుండా కొనుగోలు చేయాలని ఎన్.డి.ఎ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన రైతులకు మేలు జరిగిందని ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర బి.జె.పి అధ్యక్షురాలు దగ్గుబాటి పూరందేశ్వరి, టుబాకో చైర్మన్ చిడిపోతు యస్వంత్‌కు రైతులు ధన్యవాదములు తెలిపారు. ఎక్కువగా పండించిన పొగాకుకి ఎటువంటి రుసుము లేకుండా కొనుగోలు చేయటకు కేంద్ర ప్రభుత్వంను ఒప్పించి పర్మిషన్ తీసుకు వచ్చినందుకు రాష్ట్రంలో అధికంగా పొగాకు పండిస్తున్న ప్రకాశం జిల్లా రైతంగం తరుపున బి.జె.పి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు తిండి నారాయణ రెడ్డి, నాగ సాయి, వెంకటరామయ్య, టిడిపి నాయకులు ధన్యవాదములు తెలిపారు.





## మంత్రులను కలిసిన ఎరిక్షన్ బాబు

యర్రగొండపాలెం, మేజర్‌న్యూస్: అమరావతిలోని సచివాలయంలో నీటిపారదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని అలాగే హెూంమంత్రి అనితను యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎలక్షన్ బాబు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రుల పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని వెలుగొండ ప్రాజెక్టు అలాగే టి5 కాలువ అలాగే మంచినీటి సమస్యలను తీర్చడంలో సహాయపడాలని కోరారు. గత పాలకులు ఎర్రగొండపాలెం నియోజకవర్గాన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచారని వివరించి చెప్పారు. అభివృద్ధిలో వెనుకబడి ఉన్న ఎర్రగొండపాలెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చెందేలా అడుగులేస్తుందని వారికి వివరించి చెప్పారు. యర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికలకు ముందు గత పాలకులు పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్ ఓపెన్ చేశారని వాటిని తొలగించాలని హెూంమంత్రి అనితను ఎరిక్షన్ బాబు కోరారు.

### బోర్డు ఇచ్చిన పరిమితి మేరకే

## పొగాకు పండించాలి

**పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్**



కందుకూరు, మేజర్‌న్యూస్: పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్, వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు తో కలిసి కందుకూరు 1,2 కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు పొగాకు వేలం ను పరిశీలించి కంపనీ ప్రతినిధులను మంచి ధరలు ఇవ్వాలని కోరారు. అనంతరం రైతు సోదరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వారు 2023-2024 పంట కాలానికి ఆథరైజ్డ్ కోటా కి మించి పండించిన పొగాకు అపరాధ రుసుము లేకుండా వేలం కేంద్రం లో అమ్ము కోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది అని తెలిపారు. ఇది ఈ ఏడాది కి మాత్రమే అని తెలిపారు. ప్రస్తుత మార్కెట్ దృష్టిలో ఉంచుకుని అధిక ధరలకు పొలాలు, బారన్ లు లీజుకు తీసుకోవద్దని వచ్చే ఏడాది మార్కెట్ ఎలా ఉంటుందో చెప్పలేమని అందుకే బోర్డు అనుమతి ఇచ్చిన మేరకే పొగాకు పండించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సోదరులు పొగాకు బోర్డు చైర్మన్ గారికి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు గారికి, వైస్ చైర్మన్ గుత్తా వాసు బాబు కి అధికంగా పండించిన పొగాకు అపరాధ రుసుము లేకుండా చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. చివరగా ఈ కార్యక్రమంలో రైతు సోదరులు పొగాకు బోర్డు చైర్మన్ గారిని, వైస్ చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణ అధికారి కె. రాజగోపాల్ రెడ్డి, మరియు రైతు సోదరులు, ట్రేడ్ మిత్రులు పాల్గొన్నారు.

## విధుల పట్ల రెవెన్యూసిబ్బంది నిర్లక్ష్యంపై ఆర్డీఓ ఆగ్రహం

**జాతీయ రహదారుల నష్టపరిహారంపై సమీక్షించిన ఆర్డీఓ పి.జాన్‌ఇర్విన్**



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని రైతుల సమస్యల పరిష్కారంలో రెవెన్యూసిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం అందుబాటులో లేకపోవడం కార్యాలయానికి రాకపోవడంపై కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్‌ఇర్విన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ బెంగుళూరు కడప విజయవాడ 544జి బికెవి గ్రీన్ ఫీల్డ్ హైవే, మైదుకూరు సింగరాయకొండ 167బి జాతీయ రహదారులకు సంబంధించి అధికారులు రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈరహదారుల మార్గాల్లో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించడంలో రెవెన్యూ అధికారులు విఫలం కావడం రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండటం పట్ల ఆర్డీఓ తీవ్రఆగ్రహం వ్యక్తంచేసి ఉద్యోగ కర్తవ్యాన్ని నిర్వహించకుండా నిద్రపోతున్నారా అని అసహనం వ్యక్తంచేశారు. మండలంలోని ఏ.కొత్తపల్లి, రేగులచెలక, గుంతచెన్నంపల్లె, ఉప్పలపాడు, డిటిపల్లె, సియస్ పురం,ముసునూరు గ్రామాలకు సంబంధించి అనేకమంది రైతులకు ఇంతవరకు నష్టపరిహారం అందించడంలో రికార్డులు సక్రమంగా నివేదించక పోవడంపై రెవెన్యూసిబ్బంది మీద మండిపడ్డారు. ఈసందర్భంగా రేగులచెలక రెవెన్యూ పరిధిలో 120దరఖాస్తులు ఉండగా ఒకటికూడా ఇవ్వకుండా నిర్లక్ష్యంపై సంబంధిత విఆర్వోపై ఆర్డీఓ మండిపడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠినచర్యలు తీసుకుని ఇంటికి పంపిస్తామని భాధ్యతగా మెలగాలని వెంటనే రైతుల సమస్యలపై నివేదిక అందించి భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించడానికి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ జాన్‌ఇర్విన్, తహశీల్దార్ షేక్ నాగుల్ మీరా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కొండపల్లి వెంకయ్యకు ఘన సన్మానం



మార్టూరు, మేజర్‌న్యూస్: పట్టణంలో గడ్డం మస్తాన్వలి కార్యాలయంలో ఆయుర్వేద ఆచార్య వైద్యరత్న, నంది అవార్డు గ్రహీతశ్రీ డాక్టర్ కొండపల్లి వెంకయ్యని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ వలి మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య రంగంలో అనేక సేవలను అందించినందుకు వారిని గుర్తించి అనేక సేవా సంస్థలు, అనేక అవార్డులు ఇచ్చి సత్కరించినందుకు, అదేవిధంగా మన మార్టూరు మండల పరిధిలోని రాజుగారిపాలెం వాసి అయినందుకు నాకు ఎంతో గర్వంగా ఉందని అన్నారు. బాపట్ల జిల్లా ఆంధ్ర ప్రదేశ్ కన్జ్యూమర్ రైట్స్ ప్రొడక్షన్స్ ఫామ్ అధ్యక్షులు సయ్యద్ కరిముల్లా మాట్లాడుతూ ఆయుర్వేద వైద్య రంగంలో డాక్టర్ కొండపల్లి వెంకయ్య చేసినటువంటి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వారికి నంది అవార్డు ఇచ్చి సత్కరించినందుకు, వారు ఎన్నో సేవా సంస్థల ద్వారా 24 అవార్డులు అందుకున్నందుకు ఈ సందర్భంగా ఈరోజు నా మిత్రుడు గడ్డం మస్తాన్వలితో కలసి సత్కరిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని, వెంకయ్య ఆయుర్వేద వైద్య రంగంలో మరిన్ని సేవలు ప్రజలకు అందిచాలని వారిని అభినందించారు.



## ఆగష్టు 15న అన్నా క్యాంటీన్

చీరాల రూరల్, మేజర్‌న్యూస్: నిరుపేదల ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం ఆగష్టు 15న శాసన సభ్యుడు ఎంఎం కొండయ్య ప్రారంభించడం జరుగుతుందని యువనేత మద్దులూరి మహేంద్రనాధ్ అన్నారు. స్థానిక ముంతావారి సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ మరమ్మత్తు పనులను శుక్రవారం మహేంద్రనాధ్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మహేంద్రనాధ్ మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్‌లను గత ప్రభుత్వం మూసివేసి పేదల కడుపు కొట్టిందని మండి పడ్డారు. కూటమి అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్‌లను ప్రారంభించబోతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్ బహుకరణ

అద్దంకి, మేజర్ న్యూస్: రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సతీమణి శైలజ పుట్టినరోజు సందర్భంగా, మైక్ సెట్, విద్యుత్ గంట ను తిమ్మాయపాలెం ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలకి బహుకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీరామచంద్రమూర్తి కుటుంబంలో ప్రతి శుభ కార్యక్రమాన్ని విద్యాలయాలకు సేవ చేసే దినముగా మలుచుకొని సమాజంలో నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. పిల్లలు చిన్నతనం నుండి మంచి అలవాటులతో క్రమశిక్షణతో పెరిగి బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం బర్త్డే కేక్ కట్ చేసి, శ్రీరామచంద్రమూర్తి శైలజ దంపతులను పాఠశాల సిబ్బంది, రోటరీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య,ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, మాజీ అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ, దేవపాలన, స్కూల్ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



## రాష్ట్ర హైయర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను కలసిన ఉదయ్ శంకర్

గిద్దలూరు, మేజర్‌న్యూస్: భారతీయ జనతా పార్టీ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్ శుక్రవారం గుంటూరు ఆంధ్రప్రదేశ్ ఓరియంటల్ మన్యూ స్క్రిప్ట్ లైబ్రరీ డిపార్ట్మెంట్ డైరెక్టర్ (హయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్) డిఆర్‌వి రంగరాజన్‌ను గుంటూరు ఆఫీస్ నందు గిద్దలూరు పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మర్యాద పూర్వకంగా కలిశారు.

# భూ ఆక్రమణలు అరికట్టాలి

### అక్రమ పట్టాలు రద్దు చేసి అర్హులైన పేదలకు ఇవ్వాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండలంలోని పూరిమిట్ల పంచాయతీ పరిధిలోని 18.50 ఎకరాల వాగు పోరంబోకు భూమిని అక్రమాల నుండి కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామస్తులతో కలిసి ఆక్రమణకు గురైన వాగు పోరంబోకు భూమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తరతరాలుగా 18 1/2 ఎకరాల వాగు పోరంబోకు భూమిలో సాగుకు యోగ్యంగా ఉన్న పదిన్నర ఎకరాల భూమిని తమ పూర్వికుల కాలము నుండి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఆ వాగులో ఉన్న నీటితో తమ పశువులు, మేకలను మేపుకుంటున్నామని తెలిపారు. ఇటీవల విజయవాడకు చెందిన కొందరు వ్యక్తులు వాగు పోరంబోకు భూమికి ఇరువైపులా పట్టా భూములు కొన్నారని, మధ్యలో ఉన్న వాగు పోరంబోకు భూమినంతా చదును చేసి కంచ వేసారని తెలిపారు. ఆ భూమిని మొత్తాన్ని ఆక్రమించేటటువంటి ప్రయత్నం చేయగా తాము స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ని కలువగా జిల్లా రెవిన్యూ అధికారులను సమస్యను పరిశీలించమని తెలిపారు. దీనితో అధికారులు కదిలి ప్రభుత్వ భూమి చుట్టూ భూ ఆక్రమణదారులు వేసిన కంచను తొలగించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ వాగు పోరంబోకు భూమితో పాటు ప్రభుత్వ డీకే భూమిని మూడు ఎకరాలపైగా అక్రమార్కులు కాజేశారని, దానితోపాటు 10.50 ఎకరాల డీకే భూమిని వేరే గ్రామాల వారు, అనర్హులు అక్రమంగా పట్టాలు పొందారని వీటిని కూడా ప్రభుత్వ స్వాధీనం చేసుకొని అర్హులైన దళితులు, పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనర్హుల చేతుల్లోని భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోకపోతే తాము పేదలను కదిలించి అర్హులకు దాన్ని సాధించుకునే విధంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ భూములన్ని అక్రమార్కులు కాజేస్తుంటే పాలకులు గుడ్లప్పగించి చూస్తున్నారని అన్నారు. పేదలు ఎక్కడైనా నిలవ నీడ కోసం జానెడు జాగాలో గుడిసెలు వేసుకుంటే అరెస్టులు చేసే ప్రభుత్వం అక్రమార్కుల జోలికి పోవట్లేదని అన్నారు. మండలంలో అనేక గ్రామాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వేల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. మండలానికి సంబంధించిన భూముల సమగ్ర వివరాలన్నీ తీశామని, భూ





అక్రమణాల నుండి అక్రమార్కుల చట్టాలన్నీ బయటకు తీస్తామని ఆయన అన్నారు. పూరి మెట్ల పేదలు చేస్తున్న పోరాటానికి సంపూర్ణంగా అండదండలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన యడ్లపల్లి ఇర్మియా, చింతలపూడి ఏలియా, తలారు లాజర్, గోచిపాతల సుబ్బారావు, జి.ఏసేబు, యడ్లపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాల వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



చీరాల, మేజర్‌న్యూస్: వర్షాకాల సందర్భంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరియమ్మపేట పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ శిరీష సూచించారు. స్థానిక రోశయ్య కాలనీలో డిబిఆర్సి ఏరియా కో-ఆర్డినేటర్ వి భగవాన్‌దాసు అధ్యక్షతన శుక్రవారం వేస్ట్ పిక్కర్లకు ఆరోగ్యం మరియు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శిరీష మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు, ఈగలు విపరీతంగా వ్యాపించి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులకు కారణమైతాయని తెలిపారు. మనం నివసించే పరిసరాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఎవరైనా ఎక్కువ రోజులు జ్వరం, జలుబు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే వెంటనే సమీపంలో ఉన్న వైద్యశాలకు వెళ్లి పరిక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిహెచ్ శేషుబాబు, ఏఎన్ఎం హరిత, అంగన్‌వాడీ టీచర్ నిర్మల, సచివాలయ సెక్రటరీ మోహన్‌రావు, కాలనీ పెద్దలు టి అశోక్‌కుమార్, సురేష్, జానీబాష, వేలు, వీర, శివ, రాజశేఖర్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి హామి

### వేముల పాటి అజయ్‌కుమార్

చీరాల రూరల్, మేజర్‌న్యూస్: నియోజకవర్గంలో ఉన్న సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని జనసేన పార్టీ డిస్ప్లినరి మరియు ప్రోటోక్రాల్ ఛైర్మన్ వేముల పాటి అజయ్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ జనసేన నాయకులు శుక్రవారం అజయ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలను స్థానికులు అజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్ళగా స్పందించిన అజయ్‌కుమార్ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు సమస్య లను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. అజయ్‌కుమార్‌ను కలిసిన వారిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరాంప్రసాద్, సంయుక్త కార్యదర్శి తోట రాజ శేఖర్, చిరంజీవి, యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు, పట్టణ నాయకులు హనుమకొండ కిషోర్, జిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబర్ పలవలస శ్రీనివాస్ తదితర నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రి ఆకస్మిక తనిఖీ

కంభం, మేజర్‌న్యూస్: కంభం ప్రభుత్వాసుపత్రిని మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలను వైద్యం గురించి అడిగారు. కంభం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, కంభం ఆసుపత్రికి వస్తున్న రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చూడాలంటూ వైద్యులను, అధికారులను మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణాలను పరిశీలించారు.





## ఏకేయూ విసిని కలిసిన ఐసిఐసిఐ బ్యాంకు ప్రతినిధులు



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయానికి నూతనంగా ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ గా నియమింపబడి, ఇటీవలే భాద్యతలను స్వీకరించిన ప్రొఫెసర్ డి.వి. ఆర్.మూర్తిని ఒంగోలు నగరంలో ఉన్న ఐ.సి. ఐ.సి.ఐ. బ్యాంకు ప్రతినిధులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఒంగోలు బ్రాంచి చీఫ్ మేనేజర్ కే.రామ కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది ఉప కులపతి ప్రొఫెసర్ మూర్తికి పూల మొక్కను జ్ఞాపికగా అంద జేశారు. ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంకు ద్వారా ప్రజలకు, ఖాతాదారులకు అందిస్తున్న సేవల గురించి ఆయనకు వివరించారు. తమ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పూర్తి స్థాయిలో 24ఐ7 ప్రజలకు నేరుగా గానీ, ఫోన్ ద్వారా కానీ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని చీఫ్ మేనేజర్ రామ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్‌లో కూడా ఇంతకంటే మెరుగైన సేవలను ఖాతాదారులకు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఆయన చెప్పారు. ప్రజా సంక్షేమాన్ని, ప్రజల అవసరాలను, ఖాతాదారుల ఆలోచనలను దృష్టిలో ఉంచుకొని బ్యాంకు ఉద్యోగులు అహర్నిశలూ కృషి చేసి మంచి పేరు ప్రఖ్యాతులు గడించాలని, సేవా దృక్పథంతో పని చేయాల్సి ఉందని ఉప కులపతి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకు ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంకు సేల్స్ విభాగం రీజినల్ హెడ్స్ (ఆర్.హెచ్.ఎస్) లిపిక, ముష్రాత్‌తో బాటు బ్యాంకు సిబ్బంది నిరీక్షన్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ మరమత్తు పనుల పరిశీలన

అద్దంకి, మేజర్ న్యూస్: విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు అద్దంకి పట్టణంలోని 5వ వార్డులో శరవేగంగా జరుగుతున్న విద్యుత్ లైన్ పనులను ఆ శాఖ ఈ ఈ నల్లూరి మస్తాన్ రావు శుక్రవారం పరిశీలించారు. నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు మరమత్తు పనులు జరుగుతున్నాయని ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు కొంత ఆటంకం కలుగుతుందని దీన్ని స్థానికులు గమనించి తమ సిబ్బందికి సహకరించవలసిందిగా ఆయన కోరారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు డి ఈ ఈ సత్యనారాయణ, ఏ ఈ శివప్రసాద్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, చిలుకూరి అనిల్ కుమార్, బాచిన వెంకట సుబ్బారావు, సిబ్బంది తదితరులున్నారు.

## మహిళకు గాయాలు

చీరాల(చినగంజాం), మేజర్ న్యూస్: దిచక్ర వాహనం వెనుక చక్రంలో బుర్ఖా ఇరుక్కు పోవడంతో మహిళ కింద పడి గాయాలైన సంఘటన శుక్రవారం చినగంజాం సమీపంలో చోటుచేసుకుంది. తెలిసిన వివరాల మేరకు చీరాల ఉడ్‌నగర్‌కు చెందిన జినేఖా కుమారుడు హ్రాజ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఒంగోలు నుంచి చీరాల వస్తుంది. ఈ క్రమంలో చినగంజాం సమీపంలోకి రాగానే జినేఖా బుర్ఖా ద్విచక్ర వాహనం వెనుక చక్రంలో ఇరుక్కుపోవడంతో ఆమె ఒక్క సారిగా రోడ్డుపై పడింది. దీంతో ఆమె తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడు తక్షణమే జినేఖాను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్య పరీక్షలు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



దర్శి, మేజర్‌న్యూస్: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దొనకొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన విప్పర్ల నాగయ్యే తన వ్యక్తి గత పనిపై దర్శికి వచ్చి స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా గంగదేవి పల్లి వద్ద అకస్మాత్తుగా ఆవు అడ్డు రావడంతో ఆవుని డికొన్నాడు. ఈ ఘటనలో మొహంపై తీవ్ర గాయలు అయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది పైలట్ నరేష్ బాబు, ఈ.ఎం.టి గౌస్ బాషా క్షతగాత్రుని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.



## ఇంచార్జ్ తాసిల్దార్ దాస్‌ను కలసిన డీలర్లు

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని డీలర్లు పెద్ద దోర్నాల ఇంచార్జ్ తాసిల్దార్‌గా నియమితులైన కే.దాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో డీలర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేసు నాగేంద్రబాబు, కాశయ్య, షేక్ ఇస్మాయిల్, నాయక్, రెడ్డి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెలుదండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు పశుపోషకులు సద్వినియోగపరచుకోవాలి



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ షేక్ మునీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని డిజిపేట పశువైద్యశాల నందు ప్రభుత్వం 75శాతం రాయితీపై పిసి6 గడ్డిజొన్న విత్తనాలు డాక్టర్ మునీర్, మాజీఎంపిటిసి గోదాసు జయరాములు పశుపోషకులకు అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాయితీపై ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈసందర్భంగా డాక్టర్ మునీర్ మాట్లాడుతూ మండలానికి 2500కేజీల పశుగ్రాస విత్తనాలు వచ్చినట్లు సంబందిత రైతుసేవాకేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు కావలసిన రైతులు 25శాతం నగదు చెల్లించి పాడిరైతులు తీసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు పాడిరైతులకు పశుగ్రాస విత్తనాలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మునీర్, గోదాసు జయరాములు, గ్రామస్థులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు సత్వరమే పరిష్కరించాలి



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: పెండింగ్ పనులను సత్వరమే పరిష్కరించాలని సంతనూతలపాడు నూతన ఇంచార్జ్ తహసిల్దార్ శీలం శ్రీనివాసరావు వీఆర్వోలను ఆదేశించారు. ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం సంతనూతలపాడు రెవెన్యూ కార్యాల యంలో పెండింగ్ సమస్యల సత్వరమే పరిష్కారానికి తహసిల్దార్ శ్రీనివాసరావు వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సుమోటో క్యాస్ట్ మీసేవ సర్వీసులు మీకోసం స్పందన కార్యక్రమాలు ఎఫ్ లైన్ మ్యూ టేషన్ గ్రామ వార్డు సచివాలయాల పెండింగ్ పనులు సర్టిఫికెట్స్ జాప్యం లేకుండా వేగవంతం చేయాలని తహసిల్దార్ శ్రీనివాసరావు వీఆర్వోలకు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఒంగోలు ఆర్డీవో కార్యాలయ ప్రతినిధి వి.మనోహర్ రెడ్డి డిప్యూటీ తహసిల్దార్ షేక్ సుష్మ, సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయాల ప్రతినిధులు ఉపేంద్ర, శ్రీనివాసరావులు, వీఆర్వోలు హనుమంతరావు, కుమార్ వెంకట్రావు, పోలయ్య, శ్రీనివాసరావు, అనిల్, శేషారావు, మౌలాలి, సుబ్బమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపినేత కొదమల బాబు మృతికి సంతాపం



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని దొడిచింతల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కొదమల బాబు గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు ఆయన మృతదేహానికి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, దొడ్డిచింతల సర్పంచ్ సానికొమ్మ బ్రహ్మారెడ్డి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు. అనంతరం బాబు కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోటపాటి రమేష్ రెడ్డి, కోటపాటి మనోహర్ రెడ్డి, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, గాయం తిరుపాల్ రెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వర రెడ్డి, మొనపాటి నారాయణ, దొడ్డి చింతల తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు కొదమల బాబు పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## చందలూరు హైస్కూల్ ఆకస్మిక తనిఖీ



పంగులూరు, మేజర్ న్యూస్: మండలంలోని చందలూరు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను చీరాల ఉప విద్యా శాఖ అధికారిని ఎం. నిర్మల శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయుల డైరీలను లెసన్ ప్లాన్ లను తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేసి, గత సంవత్సరం 9 ఎన్ ఎం ఎం ఎస్ స్కాలర్షిప్లు, 5 ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించినందుకు పాఠశాల సిబ్బందిని అభినందించారు. పాఠశాల పురోభివృద్ధికి తగు సూచనలు చేశారు.శిక్షా సప్తహ్ కార్యక్రమం లో భాగంగా డిజిటల్ కంటెంట్ పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కో రారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చందలూరు గిరిజ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రాయితీపై కంది విత్తనాలు పంపిణీ

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని చిన్నదోర్నాల గ్రామంలో 30శాతం రాయితీపై కంది ఎల్ఆర్జి-52 రకాన్ని గ్రామ సర్పంచ్ గుండారెడ్డి పోలమ్మ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ దోర్నాల మండలానికి 10 క్వింటాలు మంజూరయ్యాయి. కావలసిన రైతులు పట్టాదారు పసుపుస్తకం, ఆధార్ కార్డు నకలు, ఫోన్ నెంబర్ తీసుకొని కంది విత్తనాలు పొందాలని తెలిపారు. కంది విత్తనాలు పూర్తి ఖరీదు రూ.139.80 కేజీ రాయితీ రూ.41.94 కేజీ, రైతువాట రూ.97.86 కేజిపై 30శాతం రాయితీ ఉంటుందన్నారు.



## నందనవనంలో జొన్నలు పంపిణీ

హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని నందనవనం సచివాలయంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు పశుగ్రాసం విత్తనాలు జొన్నలు పంపిణీ కార్యక్రమం ఏ.హెచ్ ఏ.నాగేశ్వరరావు, విఏఏ కాశయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరిశ పోగు కృపారావు తెలుగుదేశం పార్టీ నాయకులు పెంచికల రామకృష్ణ పాడి రైతులకు జొన్నల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపాలు రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యంగా మన గ్రామాల్లో పాడి రైతులు సబ్సిడీని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యేసు, కావేటి నారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షులు పెన్నా గురవయ్య, మాజీ ఎంపీటీసీ ఆకుపాటి శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు వెంకట శివనారాయణ, గంధం ఆదినారాయణ, సూరగాని నాగేశ్వరరావు, చిలకా కోటేష్, కొప్పు సత్యం, బత్తుల రంగయ్య, కోవూరి శంకర్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎఎస్‌డబ్ల్యుఓ అరుణ కుమారి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులతో హాస్టల్ వసతి ఏర్పాటు గురించి చర్చించడం జరిగింది. తదుపరి అరుణకుమారి సందర్శించటం జరిగింది. తదుపరి ప్రిన్సిపాల్ సమక్షంలో కాలేజీ విషయాలను విద్యార్థినీ విద్యార్థుల సంఖ్యను తరగతి గదులను సందర్శించి హాస్టల్ ఏర్పాటు కొరకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.సావిత్రి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రెండు లారీలు ఢీ : ఇరువురికి గాయాలు



బేస్తవారిపేట, మేజర్‌న్యూస్: మండలంలోని లక్ష్మీపురం సమీపంలో అనంతపురం టు అమరావతి హైవేలో రెండు లారీలు ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలు కాగా ఒక లారీ పూర్తిగా రోడ్ సైడ్ పడడంతో మరొక లారీ రోడ్డు పైనే ఉండడంతో ట్రాఫిక్ కు ఎటువంటి ఇబ్బంది కలగలేదు.



## మధ్యాహ్న భోజన పథకంలో మీల్స్ సంఖ్య పెంచాలి

### ఈతముక్కల జెడ్పీ పాఠశాలను తనిఖీ చేసిన డిఈఓ సుభద్ర

కొత్తపట్నం,మేజర్‌న్యూస్: మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో మీల్స్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర తెలిపారు. శుక్రవారం ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఈఓ సుభద్ర మాట్లాడుతూ విద్యార్థుల రోల్ 747 గాను కేవలం 340మంది విద్యార్థులు మాత్రమే భోజనం చేస్తున్నారని వారి సంఖ్య పెంచే విధంగా చూడాలని హెచ్ఎం చెంచు పున్నయ్యను ఆదేశించారు. యూడైస్‌కు సంబంధించి పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్యను పరిశీలించడం జరిగింది. అలాగే ఎండిఎం రిజిస్టర్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. నేను బడికి పోతా కార్యక్రమం గురించి స్టూడెంట్స్ ఎన్రోల్మెంట్ పెంచడం గురించి, 80 శాతం ఎండిఎం విద్యార్థులు తినేలాగా చేసే విషయం గురించి, టీచర్స్ మరియు స్టూడెంట్ అటెండెన్స్ గురించి, డ్రింకింగ్ వాటర్ ఫెసిలిటీ గురించి, టాయిలెట్స్ గురించి, శానిటేషన్ వర్కర్స్ గురించి,కంప్లైంట్ బాక్స్ ఉపయోగిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అన్ని విషయాల్లో ఎంఈఓ2 పద్మావతి మేడమ్ చెప్పిన సమాధానాలకు ప్రదానోపాధ్యాయులు చెంచు పున్నయ్య ఇచ్చే సమాధానంకు, పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించి ఇంకా అనేక విషయాలు గురించి స్టాఫ్ అందరితో మాట్లాడటం జరిగింది. పాఠశాలలో ఉన్నటువంటి అన్ని కార్యక్రమాలను పరిశీలించిన తర్వాత పాఠశాల చక్కగా మంచి వాతావరణంలో అన్ని వర్క్స్ లో కూడా చాలా చక్కని ప్రోగ్రెస్ లో ఉన్నదన్నారు. ప్రధానోపాధ్యాయులను సిబ్బందిని ఎంఈఓ 1 ,2 అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 తులసి కుమారి, ఎంఈఓ 2 పద్మావతి, ప్రధానోపాధ్యాయులు చెంచు పున్నయ్య, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# తీర ప్రాంతాలు అభివృద్ధి చేసుకోవాలి: జిల్లా కలెక్టర్

### పర్యావరణాన్ని కాపాడుకుంటూనే తీర ప్రాంతాల అభివృద్ధి చేసుకోవాలి

### బాపట్ల జిల్లాలో సముద్ర తీర ప్రాంతంను 74 కిలోమీటర్లు విస్తరించి ఉంది






బాపట్ల మేజర్‌న్యూస్: సిఆర్‌జెడ్ కింద తీరప్రాంతాలు, దాని ప్రాదేశిక నీటి పరిమితి ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. సి ఆర్ జెడ్ (కోస్టల్ రెగ్యులేషన్ జోన్) 2019 నోటిఫికేషన్ అమలు కొరకు ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. పర్యావరణాన్ని సులక్షణంగా కాపాడుకుంటూనే తీర ప్రాంతాలు అభివృద్ధి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన మడ అడవులు, వాగులు, ఇసుకదిన్నెలు మత్స్యకారులకు జీవనోపాధి కల్పిస్తూ, వారి సంరక్షణకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. మత్స్యకారులు తరతరాలుగా సముద్రంలోని మత్స్య సంపదపై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. ప్రకృతిని దెబ్బతీయకుండానే అభివృద్ధి చేస్తూ భావితరాల కొరకు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.సముద్ర తీర ప్రాంతం బాపట్ల జిల్లాలో 74కిలోమీటర్ల దూరంలో విస్తరించి ఉందని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. 492 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ ఏర్పాటు కానుందన్నారు. తద్వారా జిల్లా ప్రజలకు కలిగే ప్రయోజనం, చేపట్టే అభివృద్ధి అంశాలపై చర్చించారు. పర్యాటక రంగంగా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పర్యాటకులు, సందర్శకులు విరివిగా రావడానికి సి ఆర్ జెడ్ లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులు బీచ్‌కి వచ్చిన సమయంలో సముద్రంలో మునిగే వారికి సౌకర్యం, తదుపరి స్నానాలు చేయడం, దుస్తులు మార్చుకోవడానికి, సేద, విశ్రాంతి పొందడానికి విశ్రాంతి గదులు, రిసార్ట్స్‌లు వస్తాయన్నారు. పలు రకాలుగా అభివృద్ధి కార్యక్రమాలు జోన్ పరిధిలోకి వస్తాయన్నారు. అభివృద్ధి జరగాలంటే ప్రకృతిని కొంత విలువగా చెల్లించాల్సిన అవసరం ఉందని వివరించారు. ప్రత్యామ్నాయ మార్గాలు లేవనే విషయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. సి ఆర్ జెడ్ లో అభివృద్ధి లేని ప్రాంతాల విస్తీర్ణం కుదించాలని రిసార్ట్స్ యజమానులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పలు గ్రామాల ప్రజలు కోరారు. తీర ప్రాంతాలలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఇ రాఘవరెడ్డి, ఎన్ సి ఎస్ సి ఎం ఈఇ శాస్త్రవేత్తలు కె సౌందర్ రాజన్, ఆర్ సమనిధి, ఏపీ సి జెడ్ ఎంఎ ఈ మీరా షేక్ సుభాని, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన నేర చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలి

### ప్రజల స్వేచ్ఛను హరించే దిశగా నూతన నేర చట్టాలు

### చట్టాలపై అవగాహన సదస్సులో

### హైకోర్టు సీనియర్ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్




ఒంగోలు, మేజర్‌న్యూస్: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన నేర చట్టాలు నవ భారతానికి నూతన చట్టాలు కావని, ప్రజాసమస్యలపై ప్రశ్నించే గొంతుకలపై ఉక్కు పాదాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన నేర చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన సుంకర రాజేంద్రప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో వలస పాలకులు తీసుకువచ్చిన చట్టాలు కొనసాగకూడదని వాటి స్థానంలో నవ భారతానికి నూతన చట్టాలు తీసుకు వస్తున్నామని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన నేర చట్టాలలో గొప్పగా మార్పులు చేసిన దాఖలాలు లేవన్నారు. దేశంలోని నేర చట్టాలను సంస్కరణ పేరుతో కేంద్ర గృహ మంత్రిత్వశాఖ 2020 మే 4న ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది అన్నారు. ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీకి చెందిన మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రణబీర్ సింగ్ నేతృత్వంలో ఢిల్లీ నేషనల్ లా యూనివర్సిటీ రిజిస్టర్ జీస్ బాజ్ పాయ, ఎన్ఎల్‌యు జబల్పూర్ మొదటి వైస్ ఛాన్సర్ బాలాజ్ చౌహాన్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేష్, న్యూఢిల్లీ జిల్లా స్పెషల్ కోర్టు న్యాయమూర్తి బిపి తరేజు డోర్మర్ లను నియమించారన్నారు. ప్రజల నుండి, మేధావులు నుండి అభిప్రాయాలను సేకరిస్తున్నామనే పేరుతో న్యాయవాదుల నుండి ఎటువంటి అభిప్రాయ సేకరణ జరగకుండానే ఏకపక్షంగా వ్యవధించాలన్నారు. జూలై 1 నుండి అమల్లోకి తీసుకువచ్చారన్నారు. సెక్షన్ 111 తీసుకు వచ్చి రాజకీయ పార్టీలు, నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన నిలవకుండా, అలాగే వారికి వాటి కుటుంబ సభ్యులు ఎటువంటి ఆశ్రమం ఇవ్వకుండా ఉండేలా కఠిన శిక్షలను అమలులోకి తెచ్చారన్నారు. ఈ ప్రజాస్వామ్యాన్ని రక్షించే చట్టాల అని ప్రశ్నించారు. ఒక పక్క ఎటువంటి బెయిల్ రాని ఉపా చట్టాన్ని రద్దు చేయాలని ఉద్యమాలు చేస్తుంటే, దాని స్థానంలో 113వసెక్షన్‌కు మార్చారన్నారు. రాజ ద్రోహం చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు కోరిన నేపథ్యంలో సుప్రీంకోర్టు కూడా సానుకూలంగా స్పందించిన కారణంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కోర్టు దాకా ఎందుకు తామే రద్దు చేస్తామని రాజ ద్రోహం చట్టాన్ని రద్దు చేసింది అన్నారు. అయితే దాని స్థానంలో 124(ఏ) సెక్షన్ తీసుకువచ్చి జీవితకాల శిక్ష పడేలా తెచ్చారన్నారు. ఆత్మహత్యకు పాల్పడటం నేరం చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఒకవైపు న్యాయవాదులు పోరాడుతుంటే, అధికారుల ఎదుట తమ నిరసన తెలిపేందుకు నిరాహార దీక్షపేరుతో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన అది నేరంగా భావించే 226 చట్టాన్ని అమలులోకి తెచ్చారన్నారు. అంతే కాకుండా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌లో భూయాజమాన్య హక్కును ప్రజలకు దూరం చేసేలా చట్టాన్ని తెచ్చారు. చివరకు పోలీసులే న్యాయం చేసేలా కొత్తచట్టాలను రూపొంది ంచారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నూతన నేరచట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో సిపిఎం జిల్లా నాయ కులు జీవి కొండారెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్రకార్యదర్శి చిట్టిపాటి వెంక టేశ్వర్లు, జిల్లా కార్యదర్శి సాగర్, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి, సంయుక్త కిసాన్‌మోర్చ జిల్లాకన్వీనర్ చుండూరి రంగారావు, ఐలు జిల్లా కార్యదర్శి ఎండి యాసిన్, ప్రజాతంత్ర ఐక్యవేదిక నాయకులు, సీనియర్ న్యాయవాది పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన నూతన ఎస్పీ ఏఆర్ దామోదర్





ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా నూతన ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియాని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీకి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు, పోలీస్‌శాఖ, పరిపాలక అధికార యంత్రాంగం మధ్య సమన్వయము, జిల్లాకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.

# శ్రీ నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాలకు 70 మంది పోలీసులతో గట్టి బందోబస్తు



కొత్తపట్నం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన కొత్తపట్నంలో వేంచేసి ఉన్న శ్రీ నాంచారమ్మ తల్లి బ్రహ్మోత్సవాలకు సుమారు 70 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని రెండవ పట్టణ సిఐ జగదీష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్లో ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాలతో ఒంగోలు సబ్ డివిజన్ పోలీస్ అధికారి నేతృత్వంలో ఈ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒకటవ రెండవ పట్టణ సిఐ ఎస్.కె అలీ సాహెబ్, జగదీశ్, తో పాటు ఏడుగురు ఎస్సైలు 70 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారన్నారు. శుక్ర శనివారాలు రెండు రోజులపాటు మూడు విద్యుత్ ప్రభల వద్ద ఒక్కొక్క ఎస్సై, 15 మంది పోలీసులు నియమించామన్నారు. పల్లెపాలెంలో తిరిగే అమ్మవారి ఉత్సవానికి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పటిష్టమైన బందోబస్తు చేపడుతున్నామన్నారు.

# ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ రాహుల్ మీనా





తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని తర్లుపాడు గ్రామంలోని అపరిశుభ్రతలను తొలగించి గ్రామ ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు సంబంధిత అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, అలా లేనియెడల అజాగ్రత్తగా ఉంటే ప్రస్తుతం సీజన్‌లో వచ్చే వ్యాధుల బారిన పడిప్రజలు ఆరోగ్యాలు కోల్పోతారని మార్కాపురం డివిజన్ సబ్ కలెక్టర్ రాహుల్ మీనా మండల స్థాయి అధికారులను హెచ్చరించారు. శుక్రవారం ఉదయం మార్కాపురం నుండి వయా తర్లుపాడు మీదుగా కంభం వెళ్తూ మార్గమధ్యంలో ఉన్న హిందూ స్మశాన వాటికను, ఎస్సీ హాస్టల్‌ను, పశువైద్యశాలను సందర్శించి అక్కడి సమస్యలను అధికారుల ద్వారా తెలుసుకొని వాటిని స్వయంగా పరిశీలించి వీటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుధాకర్ సబ్ కలెక్టర్‌తో కలిసి రైల్వే ట్రాక్కు పాఠశాల గ్రౌండ్‌కు మధ్యలో ఉన్న స్థలాన్ని విడగొట్టి, ఆ స్థలంలో బిసి హాస్టల్‌ను నిర్మించినట్లయితే అక్కడ సుమారు 200 మంది విద్యార్థులకు స్థావరం ఏర్పాటు చేసుకునేందుకు బాగుంటుందని, ఆ స్థలాన్ని పాఠశాలకు అనుసంధానం చేసిన యెడల బాగుంటుందని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సబ్ కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య తెలుసు కున్నాడు. దానికి సంబంధించిన ప్రపోజల్స్ను తమ దృష్టికి తేవాలని కోరారు. ముందుగా గ్రామ సెక్రెటరీ వి.అచ్యుతరావు శుభ్రపరచిన హిందూ స్మశాన వాటికను తనిఖీ చేశారు. ఎస్సీ హాస్టల్ ఎదురుగా దుర్గంధం వెదజల్లుతున్న రోడ్డును సుబ్రపరచాలని సెక్రటరీకి తెలియజేశారు. ఎస్సీ హాస్టల్‌లోని మౌలిక సదుపాయాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. హాస్టల్ వార్డెన్ వెంకటరెడ్డిని విద్యార్థుల స్థితిగతులను గూర్చి, మెనూ విధానాన్ని అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ముళ్ళ పొదల మధ్యలో ఉన్న పశువైద్యశాలను పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జంగిల్ క్లియరెన్స్ కింద చిల్ల చెట్లను తొలగించాలని తెలియజేశారు. ఈయన వెంట తహసిల్దార్ అబ్దుల్ హమీద్, ఎంపీడీవో బుర్రి రాజశేఖరరావు, జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుధాకర్, ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, మండల పశువైద్యాధికారిణి బి.నందన, గ్రామ పంచాయితీ సెక్రటరీ వి.అచ్యుతరావు, వీఆర్వో ఎన్.భాస్కర రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అనాధ వృద్ధాశ్రమానికి సూపరింటెండెంట్ చేయూత



గిద్దలూరు, మేజర్‌న్యూస్: సంజీవిని అనాధ వృద్ధాశ్రమంలో వేదాంసి పుట్టినరోజు సంబరాలు ప్రకాశం జిల్లా కంభం మండల కేంద్రంలోని ప్రాంతీయ గవర్నమెంట్ హాస్పిటల్ విధులు నిర్వహిస్తున్నటు వంటి డాక్టర్ శివనాయక్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి బాయ్, గైనకాలజిస్ట్ ముద్దుల కుమార్తె వేదాంసి పుట్టినరోజు సందర్భంగా గిద్దలూరు పిఆర్ కాలనీలో ఉన్నటువంటి సంజీవని వృద్ధాశ్రమం, సంజీవిని ఎడ్యుకేషన్ గురుకుల స్వచ్ఛంద సేవా సంస్థ ఆశ్రమంలో ఉండే వృద్ధులకు చిన్నారులకు కేక్ కట్ చేసి స్వీట్స్ ఫ్రూట్స్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. విద్యార్థులకు వారి అవసరం నిమిత్తమై రూ.10వేలు విలువ గల ట్రంకు పెట్టెలు బహూకరించారు. మన సంజీవిని వృద్ధాశ్రమం తరపున వేదాంసికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ శివ నాయక్, హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు రాయుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హబీబ్ ఖాన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సేవాసంకల్ప చారిటబుల్ ట్రస్ట్ అన్నదానం



సంతనూతలపాడు, మేజర్ న్యూస్: సంతనూతల పాడులో శుక్రవారం స్థానిక బస్టాండ్ సమీపంలో సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు దాతల సహకారంతో నిరంతర అన్నదాన వేడుకలను నిర్వహించారు. శుక్రవారం సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రార్ షేక్ ఇస్మాయిల్ షరీఫ్ కుమార్తె ఒంగోలు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి షేక్ సల్మా జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా సేవా సంకల్పు చారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షణలో పేద వర్గాలకు ఈ సందర్భంగా అన్నదాన వేడుకలు నిర్వహించారు. తదుపరి సేవా సంకల్ప ట్రస్టు ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్ ఎస్ కే ఇస్మాయిల్ షరీఫ్ ను ట్రస్ట్ బృందం పూలమాల వేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ శిఘాకొల్లి ధనలక్ష్మి, సెక్రెటరీ చివుకుల రాంగోపాల్, జాయింట్ సెక్రెటరీ కే.వెంకటేశ్వర్లు, సభ్యులు షేక్ అజిరా బేగం, పి.నారాయణస్వామి చౌదరి, కొప్పోలు శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జున రావు, శీలం మల్లారెడ్డి, వేమా నాగరాజు, కే.ఆంజనేయులు, సుధారాణి, ఎస్.రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి స్పందన

చీరాల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని చీరాల ప్రభుత్వ వైద్యశాలలో హెచ్‌జిసి అండ్ ఎంఎన్ ఆర్ క్యాన్సర్ వైద్యశాల ఒంగోలు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్య నిపుణులు ఉషాగ్రేస్ పలువురు పేషెంట్లకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ ఉషా గ్రేస్ మాట్లాడుతూ క్యాన్సర్‌ని ప్రాథమిక దశలో గుర్తించి రోగులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రతి నెల ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధి మనకు తెలియకుండానే శరీరంలో వ్యాపించి ప్రాణాంతకానికి దారితీస్తుంది అన్నారు. ఆధునిక వైద్యంతో క్యాన్సర్ ని పూర్తిగా అదుపులో ఉంచుకొని ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. క్యాన్సర్ పట్ల ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే ప్రతినెల చీరాల ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహిస్తున్న ఉచిత మెడికల్ క్యాంపులకు హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ క్యాంపు ప్రతినిధి శరత్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చేనేత ఉద్యమకారుడు ప్రగడ కోటయ్య జయంతి

చీరాల, మేజర్‌న్యూస్: సామాజిక విప్లవకారుడు చేనేత ఉద్యమ సూరీడు చేనేత రంగం అభివృద్ధికి ప్రగడ కోటయ్య అనితర సాధ్యమైన సేవలందించారు. ప్రముఖ జాతీయోద్యమ నాయకుడు చేనేత పరిశ్రమ రక్షణ కోసం పోరాటం చేసిన యోధుడు ప్రజా బంద్ ప్రగడ కోటయ్య 110వ జయంతి సందర్భంగా శుక్రవారం చీరాల ఎమ్మెల్యే తనయుడు మద్దులూరి మహేంద్రనాథ్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మహేంద్ర నాథ్ మాట్లాడుతూ చేనేత పరిశ్రమ రక్షణ కోసం పోరాటం చేసిన యోధుడు ప్రజా బంధు ప్రగఢ కోటయ్య అని అన్నారు. ఆయన చేనేత పరిశ్రమ కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ వనరులపై విద్యార్థినులకు అవగాహన



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శుక్రవారం డిజిటల్ కార్యక్రమాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్యానల్స్, ట్యాబుల వినియోగం, కంప్యూటర్ సిస్టం ఇంటర్నెట్ ఉపయోగించడం ఆండ్రాయిడ్ తదితర అంశాలు పాఠ్య పుస్తకాల స్కానింగ్ ప్యానల్ కంప్యూటర్ సిస్టం కనెక్టివిటీ మీద డిజిటల్ వనరుల వినియోగంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్ పరిజ్ఞానానికి అత్యంత ప్రాధాన్యత ఉన్నట్లు విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేక అధికారిణి షేక్ రేష్మా, సిబ్బంది, విద్యార్థినులు ఉన్నారు.

## పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రతిఒక్కరు ఆరోగ్యవంతంగా ఉండాలంటే పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని అంగన్వాడీ కేంద్రం నందు హ్యాండ్ వాష్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చేతులు కడిగించి అనంతరం మాట్లాడుతూ లబ్ధిదారులకు పిల్లలకు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన చేతులలో ఎటువంటి క్రిములు ఉండవని అదేవిధంగా పరిశుభ్రతను పాటిస్తే ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని శుభ్రత పరిశుభ్రత భాద్యతగా భావించి ఇంటిపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంటువ్యాధులు రాకుండా ఉంటాయని శుభ్రతను పాటిద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, సచివాలయం కార్యదర్శి వాణి, అంగన్వాడీ కార్యకర్త నారాయణమ్మ, సచివాలయం సిబ్బంది, ఆశా కార్యకర్తలు, లబ్దిదారులు ఉన్నారు.

## డ్రైవర్ కుటుంబానికి రూ.40 వేలు ఆర్థిక సహాయం

మార్కాపురం, మేజర్‌న్యూస్: డ్రైవర్ కోటిరెడ్డి కుటుంబానికి కారు ట్రావెల్స్ ఓనర్స్, డ్రైవర్లు 40 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు.డ్రైవర్ కోటిరెడ్డి కొన్ని రోజుల క్రితం ఆరోగ్యం బాగాలేక మరణిం చారు. అయన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని గమనించిన మోటార్ కార్ ట్రావెల్స్ ఓనర్స్ డ్రైవర్లు తమకు తోచిన సహాయం అందరూ సేకరించారు. తమలో ఒకడిగా మెలిగిన కోటి రెడ్డి కుటుంబానికి ఎల్లవేళల సహాయం అందిస్తానని భరోసా కల్పించారు. కోటిరెడ్డి కుటుంబానికి ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య, కార్ ట్రావెల్స్ ఓనర్స్, డ్రైవర్లు పాల్గొన్నారు.



## కొర్రపంట సాగు పరిశీలన

రాచర్ల, మేజర్‌న్యూస్: మండలంలోని అనుమలవీడు, సోమిదేవిపల్లె గ్రామంలో ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్లో 530 ఎకరాలలో పత్తి పంటకు ప్రత్యామ్నాయంగా కొర్ర పంటను సాగు చేయడం జరిగిందని తెలిపారు. కొర్ర పంట కూడా ఇటీవల కురిసినటువంటి వర్షాలకు పంట బాగా ఉందని తెలిపారు. ప్రస్తుతం కొర్ర పంటలో సమగ్రమైన సస్య రక్షణ పద్ధతులు పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. అనంతరం రాచర్ల మండలంలోని రాయలసీమ గ్రామీణా బ్యాంకు మేనేజర్‌ని కలిసి కౌలు రైతుల జాబితాను ఇవ్వడం జరిగింది. ఈ సంవత్సరం కౌలు రైతులకు లోన్లు ఇచ్చే విధంగా చూడాలని బ్యాంక్ మేనేజర్‌ను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాచర్ల షేక్ అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

# పేస్‌లో ప్రారంభమైన ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సర తరగతులు





ఒంగోలు, మేజర్‌న్యూస్: నగర పరిధిలోని పేస్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ శుక్రవారం నుండి ప్రథమ సంవత్సర ఇంజనీరింగ్ క్లాసులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్ రెడ్డి ముమ్మడి (హెచ్ ఆర్ కాన్సెంట్రిక్స్ క్యాటలిస్ట్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ) హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ వృత్తి విద్యా నైపుణ్యాలను మెరుగుపరచుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించుటకు అవసరమైన అన్ని సదుపాయాలు పేస్ కళాశాలలో ఉన్నాయని తెలియజేశారు. విద్యార్థులందరూ ఈ సౌకర్యాలు అన్నిటిని ఉపయోగించుకొని భవిష్యత్తులో ఉన్నతమైన ఉద్యోగాలు సాధిస్తారని ఆకాంక్షను వెలిబుచ్చారు. నూతన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ మా కాలేజీ మీద నమ్మకం పెట్టుకొని, ఆప్షన్లు పెట్టుకొని 100 శాతం అడ్మిషన్లు భర్తీకి సహకరించిన విద్యార్థినీ విద్యార్థులకు తల్లిదండ్రులకు శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని గమ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మీ మీ బ్రాంచుల్లో ఉత్తమ ప్రతిభను కనపరచాలని మన కాలేజీకి, మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జివి కే.మూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో సానుకూల దృక్పథంతో మంచి ఆలోచనలతో రాణిస్తేనే ఉన్నతస్థాయిలో రాణించగలరని దానికి తగినట్టుగా అనిత్న విధాలుగా మీపిల్లలను అభివృద్ధి చేస్తామని భరోసాఇచ్చారు. డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ కే.రూపఅక్కేష్ మాట్లాడుతూ మంచి ఉద్యోగం రావడానికి కారణమైన నైపుణ్యాలను ప్రతి సంవత్సరం పెంపొందిస్తూ తగిన శిక్షణ కార్యక్ర మాలను రూపొందిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రథమ సంవత్సర విభాగా ధిపతి రవీంద్ర, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్. వీరాంజనేయులు, డీన్ అకాడమిక్స్ సివి సుబ్బారావు, అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ ఎం.రమణబాబు, వివిధ భాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థి, విద్యార్థినిలు పాల్గొని విజయవంతం చేశారు.

# కార్గిల్ యుద్ధ వీర జవాన్ల త్యాగాలను యువత స్మరించుకోవాలి






### బిజేపి జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు

ఒంగోలు, మేజర్‌న్యూస్:కార్గిల్ యుద్ధ వీర జవాన్ల త్యాగాలను ప్రతీ ఒక్కరూ స్మరించుకోవాలని భారతీయ జనతా పార్టీ ప్రకాశం జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు పిలుపునిచ్చారు. నగరంలోని ఓ విద్యాసంస్థలో బిజేపి యువ మోర్చా జిల్లా అధ్యక్షులు పువ్వాడ దామోదర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో బొద్దులూరి ఆంజనేయులతో పాటు బాపట్ల జిల్లా ఇన్‌చార్జ్ పివీ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు హాజరైయ్యారు. ముందుగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బొద్దులూరి ఆంజనేయులు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం 1999 సంవత్సరంలో జరిగిందన్నారు. జులై 26వ తేదీన యుద్ధం గెలిచామన్నారు. అనాడు ప్రధాని మంత్రి అటల్ బిహారీ వాజపేయి హాయంలో ఈ యుద్ధం 11 వారాలు జరిగిందన్నారు. సుమారు 30 వేల మందికిపైగా జవాన్లు ఈ యుద్ధంలో పాల్గొనగా 527 మంది జవాన్లు వీర మరణం పొందారు. 1,628మంది జవాన్లు గాయాల పాలైయ్యారని వివరించారు. దేశ భద్రత, రక్షణ కోసం ఆ యుద్ధంలో వీర మరణం పొంది ప్రతీ ఒక్క జవాన్ త్యాగాన్ని నేటి యువత స్మరించుకోవాల్సిన అసవరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా ప్రధాన కార్యదర్శి నాయక్, ఉపాధ్యక్షుడు ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

# కైతేపల్లిలో అగ్ని ప్రమాదం : మంటలలో కాలిపోయిన గేదలు, పశువుల చావిడి







రేపల్లే మేజర్‌న్యూస్: రేపల్లె రూరల్ మండలం కైతేపల్లి గ్రామం లో జరిగిన అగ్ని ప్రమాదంలో అల్లపర్తి. సుబ్బారావు కు సంబంధించిన గేదెలు, పశువుల చావిడి అగ్ని ప్రమాదానికి గురై కాలిపోవడం జరిగిందని అగ్నిమాపక శాఖ అధికారి సాంబశివ రావు తెలిపారు. ఈ ప్రమాదంలో గేదెలు, చావిడి పూర్తిగా కాలిపోయినదని, ఒక గేదే, దూడ మంటలలో పూర్తిగా కాలిపోయి చనిపోయాయి. ఒక పాడిగేదె పూర్తిగా కాలిన గాయలతో ఆ గేదే విలవిల లాడుతోంది. విషయం తెలుసుకున్న పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నాంచారయ్య,రేపల్లే మండల పశువైద్యాధికారి వారికి తక్షణ అత్య వసర వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. సహాయ సంచాలకుల ఆదేశాలు ప్రకా తరం డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి సిబ్బంది తో చేరుకొని కాలిన గాయలతో ఇబ్బంది పడుచున్న పశువులను వైద్యసేవలు అందించారన్నారు. రైతు కి జరిగిన అగ్ని ప్రమాదం వలన 1లక్ష యాభై వేల రూపాయలు వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్‌ఆఫీసర్ సాంబశివరావు తెలియపరిచారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద రైతు సుబ్బారావు తమ పశువులు చనిపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కుటుంబ సభ్యులకు పరామర్శ



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: వెంకటేశ్వర్లు మృతి పార్టీకి తీరని లోటుని నిజాంపట్నం టిడిపి సీనియర్ నాయకుడు బొమ్మిడి రామకృష్ణ అన్నారు. మండలంలోని దిండిఅదవల గ్రామనికి చెందిన టిడిపి కార్యకర్త యేమినేని వెంకటేశ్వర్లు గత రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చదగా శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన మృతి చెందిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధర్యం చెప్పి పార్టీ, రాష్ట్ర మంత్రి అనగాని సత్య ప్రసాద్ అండదండలు కుటుంబానికి ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు నాయుడు నరసింహమూర్తి, ఖాదర్ బాబు, ఇమ్రాన్ ఖాన్, బొమ్మిడి నరసింహారావు, కార్యకర్తలు ఉన్నారు.

## 30న జాబ్ మేళా

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఈనెల 30వ తేదీన జిల్లా ఉపాధి కార్యాలయంలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు అధికారి టి. భరద్వాజ్ తెలిపారు. కె. ఎల్ గ్రూప్ ప్రత్యేకంగా అమెజాన్ రిటైల్ రంగంలో ఉద్యోగావకాశానికి సంబంధించి కంపెనీలో ప్యాకింగ్, పికింగ్, స్కానింగ్, లోడింగ్, అన్లోడింగ్ సెక్టార్లలో వివిధ రకాల ఖాళీలను భర్తీచేయుటకు ఏదైనా విభాగంలో ఐ.టి.ఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్మీడియేట్ ఏదైనా డిగ్రీ చదువులు పూర్తి చేసిన వారికి ఇంటర్వ్యూలు జరగనున్నాయి. 30 వ తేదీన (మంగళవారం) ఉదయం 10:00 గం.ల నుండి సాయంత్రం 3గం.ల వరకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఇంటర్వ్యూలో ఎంపిక కాబడిన అభ్యర్థులకు జీతం నెలకు 16,975 టేక్ హెూమ్, ఉండడానికి నివాసం, రవాణా ఖర్చులు, ప్లస్ పని తీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకలు ఇవ్వటం జరుగు తుందని తెలిపారు. జిల్లాలోని 18 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాల మధ్య గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఇంటర్వ్యూకు ఆధార్ కార్డు, సరిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని టి. భరద్వాజ్, జిల్లా ఉపాది కార్యాలయం అధికారి తెలిపారు.

## పట్టణ ఆరోగ్య కేంద్రం పేరు మార్పులో జాప్యం







బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం వివేకానంద కాలనీ 9వ సచివాలయం సంజయ్ గాంధీ కాలనీ నందు డా. వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, (పట్టణ ఆరోగ్య కేంద్రం) పేరు తొలగించకుండా విధులు నిర్వహి స్తుండటంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 40రోజులు కావస్తున్నా పేరు తొలగింపులో జరుగుతున్న జాప్యం పై ప్రజల నుండి సర్వత్రా విమర్శలు వినపడుతున్నాయి. అలాగే రైలు పేట ఏడవ వార్డు ఆరోగ్య కేంద్రానికి వెళ్ళుటకు ఏర్పరిచన దిక్సూచి బోర్డు నందు కూడా పేరు తొలగించకుండా వైయస్సార్సీపి ప్రభుత్వానికి వైద్య ఆరోగ్య శాఖ అంట కాగిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా నామమాత్రపు సేవలందించారని ప్రజలు వారి అభిప్రాయాన్ని వెల్లబుచ్చుతున్నారు.

## 'డయేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

కొల్లూరు మేజర్ న్యూస్ కొల్లూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డయేరియా కార్యక్రమంనిర్వహిం చారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ కావ్య, డాక్టర్ సంధ్య మాట్లాడు తూ డయేరియా వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలోని ప్రజలందరూ పరిశుభ్రమైన తాగునీరు తీసుకోవాలని, కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీరు కలుషితం కాకుండా గ్రామపంచాయతీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. తినే ఆహార పదార్థాల విషయంలో కూడా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటే డయేరియా లాంటి వ్యాధులను అరికట్టవచ్చునని మంచి నీటి పరీక్షలను గ్రామంలో నిర్వహించాలన్నారు, పాఠశాలలో విద్యార్థులకు డయేరియా పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ప్రజలకు చైతన్యం కలిగించాలని తెలిపారు.ఈ కార్య క్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, మరి ఆశ వర్కర్లు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# కార్యాలయం అపరిశుభ్రతపై ఆర్డిఓ సీరియస్



కొత్తపట్నం, మేజర్‌న్యూస్: తాసిల్దార్ కార్యాలయాన్ని ఒంగోలు ఆర్డీవో జీవీ సుబ్బారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం కార్యాలయంలోని గదులను పరిశీలన చేశారు. కార్యాలయంలోని గదులలో అపరిశుభ్రంగా ఉండడం పట్ల ఆర్డిఓ సుబ్బారెడ్డి సిబ్బందిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే శాఖపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కనీసం రికార్డు గది సంవత్సరానికి ఒకసారి అయినా తలుపులు తెరిచి రికార్డులను శుభ్రం చేసుకోవాలన్నారు. కొన్ని రూములు పనికిరాని వస్తువులతో కూడి ఉండటంతో అపరిశుభ్రంగా ఉందని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని రూములు తలుపులు కూడా తీయడం లేదని అందుచేతనే ఆఫీసు అంతా అపరిశుభ్రంగా ఉందని తెలిపారు. వీఆర్వోలతో మాట్లాడుతూ సచివాలయం మీ సేవలు ప్రతి ఒక్కరూ పెండింగ్ లేకుండా చూడాలని తెలియజేశారు. మ్యూటేషన్ రిజిస్టర్ మెయింటినెన్స్ సక్రమంగా ఉందా లేదా అని ఆరా తీయడం జరిగింది. రికార్డ్ అసిస్టెంట్ కచ్చితంగా ప్రతి ఒక్క రికార్డు మైంటైన్ చేయాలని తెలియజేశారు. రికార్డు మైంటైన్ చేయడం ద్వారానే పని సులువు అవుతుందని ప్రజలకు సేవ చేయటంలో ముందుంటామని తెలియజేశారు. పనికిరాని వస్తువులు ఏమైనా ఉంటే వాటి స్థానంలో కొత్త వస్తువులు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఒంగోలు డివిజన్ పరిధిలో సిబ్బంది పనిచేయకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని ప్రజల యొక్క సమస్యలు ఒళ్ళు వంచి పని చేసేలా కృషి చేయాలని వారికి తెలియజేశారు. ఫైల్ మెయింటినెన్స్ సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు అన్యాకాంతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తాసిల్దార్ అర్జున్ రెడ్డికి తెలియజేశారు. ఆయన వెంట డిప్యూటీ తాసిల్దార్ అర్జున్ రెడ్డి, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, విఆర్వోలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# క్రికెట్ పోటీల్లో సెమీ ఫైనల్స్‌కు చేరిన పేస్ ఎన్ఆర్ ఒలింపియాడ్ విద్యార్థులు



ఒంగోలు, మేజర్‌న్యూస్: స్థానిక నెల్లూరు బస్టాండ్‌లోని మున్సిపల్ పాఠశాల మైదానంలో గత రెండు రోజుల నుండి జరుగుతున్న స్వాతంత్ర దినోత్సవ క్రీడా పోటీల్లో క్రికెట్ విభాగంలో గుంటూరు ఆక్స్ఫర్డ్ మరియు పేస్ఎన్ఆర్ విద్యార్థుల మధ్య జరిగిన క్రికెట్ పోటీల్లో ఎస్ఎన్ఆర్ విద్యార్థులు 45 పరుగుల తేడాతో భారీ విజయం సాధించారు. దీంతో ఎస్ఎన్ఆర్ ఒలింపియాడ్ విద్యార్థులు సెమీఫైనల్‌కు చేరినట్లు జై భీమ్ ఫౌండేషన్ యూత్ ఆర్గనైజర్ చిక్కాల కిరణ్ కుమార్ తెలియజేశారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారేళ్ళ సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏజె సొల్యూషన్ డైరెక్టర్ ప్రియా, హైకోర్టు న్యాయవాది మాన్నం సుధీర్ డిఆర్ఎంఎం హైస్కూల్ హెడ్ మాస్టర్ వెంకట్రావు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి సుబ్బయ్యపాలెంలో 'మడ అడవుల పరిరక్షణ దినోత్సవం'



వేటపాలెం, మేజర్‌న్యూస్: ప్రపంచ మడ అడవుల పరిరక్షణ దినోత్సవ సందర్భంగా స్థానిక పొట్టి సుబ్బయ్య పాలెం బీచ్ నందు ట్రీ ఫౌండేషన్ - ఐటిసి బంగారు భవిష్యత్ ఆంధ్ర ప్రదేశ్ అటవీ శాఖ సహకారంతో నిర్వహిస్తున్న మడ మొక్కల నర్సరీ వద్ద మడ మొక్కల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వేటపాలెం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వై.జాన్సన్ పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యం పరిరక్షణలో మడ మొక్కలు ప్రధాన భూమిక అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిసి బంగారు భవిష్యత్ టీమ్ నుండి కోట గౌరీ నాయుడు సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంత గ్రామాలకు మడ మొక్కలు, సముద్ర తాబేళ్లు మిత్రులు అని పేర్కొన్నారు. చీరాల ఐటిసి, ఐఎల్‌టిడి డివిజన్ హెచ్ ఆర్ మేనేజర్ సిజె విజయ లక్ష్మి, సేఫ్టీ అధికారి ఎంఎస్ రెడ్డి ఆధ్వర్యంలో తీరం నందు కాకి పొన్న, పొన్న, పెద్ద గదర, దుడ్డు పొన్న, నల్ల మడ జాతుల మడ మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ ఎ.నిరంజన్, సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ డి.సాయి గౌతం, పుల్లరి పాలెం బీట్ అధికారి బి.శిరీష, పొట్టి సుబ్బయ్య పాలెం గ్రామం పెద్దా కాపు కోడూరి జాలయ్య, గ్రామ ప్రజలు సముద్ర తాబేళ్ల సంరక్షకులు జయరాం, వెంకటేశ్వర్లు, ఏటిమోగ, రామచంద్ర పురం, కుంకుడు చెట్ల పాలెం, రామాపురం, సూర్య లంక గ్రామాల సముద్ర తాబేళ్ల సంరక్షకులు ట్రీ ఫౌండేషన్ అకౌంటెంట్ సంయుక్త జిల్లాల సమన్వయ కర్త శవనం చంద్రారెడ్డి పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



తాళ్లూరు, మేజర్‌న్యూస్: గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఒంగోలు డీఎల్పీఓ పద్మజ అన్నారు. మండలంలోని బొద్దికూరపాడు పంచాయితీలో శుక్రవారం వాటర్ ట్యాగ్నెట్ (శానిటేషన్), కాలువ పూడికతీత పనులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిశుభ్రత వలన ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. సాధారణంగా వర్షాలు పడే సమయంలో డెంగ్యూ, మలేరియా, డయోరియా, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలే ప్రమాదముందన్నారు. ముందస్తు చర్యలలో భాగంగా ప్రతి పంచాయితీలో శానిటేషన్ పనులు, పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. సైడు కాల్వలలో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. ప్రధాన వీధులలో రోడ్ల వెంబడి మురుగునీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఈ ఓఆర్డిని ఆదేశించారు. మురుగునీరు నిల్వ ఉన్న చోట ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకొని యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేపించాలన్నారు. పంచాయితీ, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పని చేయడం ద్వారానే వ్యాధులను నియంత్రించవచ్చాన్నారు. గ్రామంలో ప్రొక్లెయిన్ సహాయంతో చేపడుతున్న పూడిక తీతపనులను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఆమె వెంట సర్పంచ్ మందా శాంసన్, ఈఓఆర్డీ రాజు, పంచాయితీ కార్యదర్శి హసీనాబేగం, ఉప సర్పంచ్ పులి ప్రసాదరెడ్డి ఉన్నారు.

# నేరాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలి

చట్టవ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టి నివారించాలి

పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి

పొదిలి పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ దామోదర్











పొదిలి, మేజర్‌న్యూస్: చట్ట వ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘాపెట్టి నివారించాలని జిల్లా ఎస్పీ విఆర్ దామోదర్ అన్నారు.శుక్రవారం ఆయన పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు,లాకప్,పరిసర ప్రాంతాలు, సర్కిల్ కార్యాలయం,పోలీసు క్వార్టర్లు,పోలీసు పెట్రోల్ బంక్, రీ మోడలింగ్ చేస్తున్న పాత పోలీసుస్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీచేసి సంతృప్తి వ్యక్తం చేసి సిఐ మల్లికార్జునరావు, ఎస్ఐ జి కోటయ్యలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు.విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది వివరాలు వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు.పోలీసు సిబ్బంది పిల్లలతో కాసేపు సరదాగా మాట్లాడి చదువుల్లో రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని చెప్పారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ పోలీసులు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు పోలీసు శాఖపై నమ్మకం పెంచాలని కోరారు.కేసులు అపరిస్కృతంగా ఉండకుండా త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. గస్తీ ముమ్మరం చేసి అసాంఘిక శక్తుల కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలన్నారు.,సాంకేతికత పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు.ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటిస్తూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి,ఫిర్యాదులు స్వీకరించి జవాబుదారిగా ఉండాలన్నారు.ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించి,ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలన్నారు.స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వారిపై నిఘా పెట్టాలన్నారు. ఈవిటీజింగ్,డంక్ అండ్ డ్రైవ్,త్రిపుల్ డ్రైవింగ్,విచిత్ర సిక్టర్లు వేసుకొని వాహనాలు నడిపే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు.మహిళలు,పిల్లలకు సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పందించిపోలీసుశాఖపై నమ్మకం పెంపొందేలా సేవలు అందించాలని సూచించారు. పోలీసుస్టేషన్ ఆవరణ పచ్చదనంతో ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐ మల్లికార్జునరావు,ఎస్ఐ జి కోటయ్య,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# స్టేషన్ పరిధిలో నేరాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలి

## మర్రిపూడి పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ దామోదర్







మర్రిపూడి,మేజర్‌న్యూస్: స్టేషన్ పరిధిలో నేరాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ విఆర్ దామోదర్ అన్నారు.శుక్రవారం ఆయన పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు,లాకప్,పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీచేసి సిఐ వై పాండురంగారావు, ఎస్ఐ సిహెచ్ శివబసవరాజులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు.విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది వివరాలు వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. పోలీసులు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు పోలీసు శాఖపై నమ్మకం పెంచాలని కోరారు.పెండింగ్‌కేసులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.నేరాలను అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని,సాంకేతికత పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు.ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటిస్తూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి,ఫిర్యాదులు స్వీకరించి జవాబుదారిగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు గట్టి కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో సిఐ వై పాండురంగారావు,ఎస్ఐ సిహెచ్ శివబసవరాజు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు

అద్దంకి, మేజర్ న్యూస్: వరి పంటకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న పంట సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై రామకృష్ణ తెలిపారు. మండలంలోని శింగరకొండ పాలెం గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంట ను ఏ.డి ఏ ధనరాజు, మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తో కలిసి శుక్రవారం పరిశీలించారు. మొక్కజొన్న ప్రాథమిక దశలోనే కత్తెర పురుగు పై సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంటల సాగు, ఎరువుల వాడకం వంటి పలు విషయాలపై రైతులతో చర్చించారు.

## ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరిస్తా

### - కమిషనర్ సత్యనారాయణ



అద్దంకి, మేజర్ న్యూస్: వార్డులలో నెలకొన్న ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరిం చేందుకు చర్యలు చేపడతానని పురపాలక కమిషనర్ సత్య నారాయణ అన్నారు. పట్టణం లోని 8 వ వార్డ్ పరిధిలోని నర్రా వారిపాలెం, రామకృష్ణపురం, శ్రీరామ్ కాలనీ, గోర్లమెట్ట, ప్రాంతం లో ఆయన శుక్రవారం పర్యటిచారు. ఈ సందర్భంగా వచ్చిన ఆయనకు స్థానికులు పలు సమస్యలను వివరించారు. సైడ్ కాలువలు, కరంట్ సమస్య, తాగునిటీ, శానిటేషన్, కుక్కల బెడద ఎక్కువ గా ఉందని, చేతి పంపులు రిపేర్ లు ఉన్నాయని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపడతామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు దోప్పలపూడి దుర్గ ప్రసాద్, బిళ్లపాటి రామాంజనేయులు, నర్రా రవీంద్రనాథ్, నర్రా సుబ్బారావు, నర్రా శివకృష్ణ, బొజ్జా విజయ్ కుమార్, యార్దనపూడి రామకృష్ణ, మునిసిపల్ అధికారులు శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పల్లవ గ్రానైట్ క్వారీ పరిశీలన





చీమకుర్తి, మేజర్‌న్యూస్: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామ పరిధిలోని పల్లవ గ్రానైట్ క్వారీలో సర్వేనెం 86/2లోని 5 ఎకరాల 14 సెంట్ల విస్తీర్ణంలో అక్రమ మైనింగ్ ఎలాంటి గ్రానైట్ లీజు కాని ఎన్ఓసి కాని లేకుండా మైన్స్, సేఫ్టీ వారి అనుమతి లేకుండా గ్రానైట్ క్వారీని నిర్వహిస్థూ 5 నుంచి 7 పొక్లిన్‌లు పెట్టి గ్రానైట్ పనులు నిర్వహిస్తూ 10 చక్రాల లారీలతో అక్రమంగా బిల్లులు లేకుండా రాళ్ళు నిరంతరం తరలిస్తున్నారు. ఇది కాక పల్లవ గ్రానైట్ క్వారీలోని కలుషిత వ్యర్థ జిల్లాలు పైపులు ద్వారా మైలవరం కాలువలో కలపడం వలన ప్రజలు ప్రాణాంతక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఈనెల 11న జిల్లా జాయింట్ కలెక్టర్‌కి మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేయగా జాయింట్ కలెక్టర్, డిడి మైన్స్ వారికి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఒంగోలు వారికి విచారణ చేసి రిపోర్ట్ ఇవ్వమని చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం 2.30నిలకు విచారణకు రావాలని మైనింగ్ అధికారులు తెలుపగ సదరు పల్లవ గ్రానైట్ క్వారీ వద్దకు నేను వెళ్లగా అక్కడ ఉన్నత అధికారులు కాకుండా ఆర్ఐ మైన్స్ వారు మాత్రమే ఉన్నారు. ఇతర శాఖల అధికారులు లేరు ఇదేమి అని నేను ప్రశ్నించగా విచారణను వాయిదా వేసి ఇంకొక తేదీన విచారణను జరుపుతామని వెనుతిరిగి వెళ్లిపోయారు. సకాలంలో విచారణ జరపక పోవడం వలన వాస్తవాలు కనుమరుగయ్యే అవకాశం ఉంది కనుక అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడవలసిందిగా కోరుచున్నాను.

## మోటార్ బైక్ ను ఢీకొన్న ఆటో





పంగులూరు, మేజర్ న్యూస్: వేగంగా వెళుతున్న ఆటో ముందు వెళ్తున్న బైక్ ను ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి రక్త గాయాలయ్యాయి. .మండలంలోని బైట మంజులూరు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో జరిగింది. హైవే సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం, గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం తాళ్లూరు కు చెందిన టి .మణికంఠ అనే ఆటో డ్రైవర్ తన ఆటోతో గుంటూరు నుండి జాతీయ రహదారిపై మేదరమెట్ల వెళుతున్నాడు. మండలంలోని బయట మంజులూరు సమీపం లోకి ఆటో వచ్చే సమయంలో ఆటోకు ముందుగా హీరో హోండా గ్లామర్ బైక్ వెళుతుంది. వెనుక నుంచి వచ్చిన ఆటో బైక్ ను ఢీకొని, ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గుంటూరు జిల్లా మేడికొండూరు గ్రామానికి చెందిన కే .శివ పార్వతి అనే మహిళ కూడా ఆటోలో ఉంది. ఆమె కాలికి తీవ్ర రక్త గాయం అయింది. బైకు మీద ఉన్న మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన పూర్ణారావు, జనకవరం గ్రామానికి చెందిన కుంచాల మహేష్, జనకవరం గ్రామానికి చెందిన కుంచాల శివకృష్ణలకు గాయాలయ్యాయి . క్షతగాత్రులు నలుగురిని హైవే అంబులెన్స్ పైన చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## సుదర్శన క్రియతో సంపూర్ణ ఆరోగ్యం

### - కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపల్ మాలకొండమ్మ

రాచర్ల, మేజర్‌న్యూస్: మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల నందు మూడు రోజుల నుండి జరిగిన యోగా శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రిన్సిపాల్ మాలకొండమ్మ మాట్లాడుతూ కస్తూరి బా గాంధీ పాఠశాల నందు యూత్ ఎంపవర్మెంట్ సెమినార్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. శ్వాస ప్రక్రియలు సుదర్శన క్రియ భస్త్రిక ప్రాణాయామము సూక్ష్మ ప్రాణాయామాలతో విద్యార్థినులు వ్యక్తిగత సమస్యల నుండి కూడా ఒత్తిడిని అధిగమించి రాబోవు రోజులలో పబ్లిక్ పరీక్షలలో కూడా ధైర్యంగా ప్రశాంతమైన స్థితి కల్పించే యోగా శిక్షణ చేపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి, సంఘ సేవకులు సాయికిరణ్, బిందు, పాలుగుళ్ల పురుషోత్తం రెడ్డి, మనోహర్ రెడ్డి, విద్యార్థినిలు సంబంధిత నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

## హిందు సంప్రదాయాలు తెలియచేయాలి

### - సైకిల్ యాత్ర చేపట్టిన మురళీధర్



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: హిందువుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతి ఒక్కరికి తెలియాలని, సమాజంలోని ప్రతి ఒక్కరు బాగుండాలని దేవరకొండ మురళీధర్ సైకిల్ యాత్ర చేపట్టారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దేవరకొండ మురళీ ధర్ ఏప్రిల్ 29న సైకిల్ యాత్ర చేపట్టారు. ప్రొద్దుటూరు నుండి హైదరాబాద్ వరకు సైకిల్ చేస్తూ మార్గ మధ్యలో ఉన్నా దేవాలయాలు సందర్శించారు. ఇప్పటి వరకు 2950 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఆ సైకిల్ యాత్ర ముండ్లమూరుకు చేరుకుంది. ఇక్కడ నుండి మార్గ మధ్యలో దేవాలయం లను సందర్శించి, పూజలు నిర్వహిస్తూ అరుణాచలం వరకు సైకిల్ యాత్ర చెయనున్నట్లు మురళీధర్ తెలిపారు.

## మాదిగభవన కార్మికుల సమ్మేళన సభ జయప్రదం చేయాలి



మర్రిపూడి మేజర్ న్యూస్: మండల కేంద్రంలో ఆగస్టు మొదటి వారంలో మండల స్థాయి మాదిగ భవన కార్మికుల సమ్మేళన సభ నిర్వహించనున్నట్లు జిల్లా మాదిగ జర్నలిస్టుల ఫారమ్ అధ్యక్షులు గురిజాల బాబురావు మాదిగ పిలుపునిచ్చారు,మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ అన్న ఆదేశాల మేరకు ప్రతి మాదిగ పల్లెలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేయాలన్నారు, అంతేకాకుండా జెండా దిమ్మెలు కూడా ఏర్పాటు చేయాలని కోరారు,అందులో భాగంగా ఈనెల 24వ తేదీ కృష్ణ మాదిగ సర్కులర్ ప్రకారం ఒంగోలు అంబేద్కర్ భవనంలో జిల్లాస్థాయి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎం జె ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు, ఈసమావేశంలో ప్రతి గ్రామంలో వర్గీకరణ విషయాలను ప్రతి ఒక్కరుకి తెలిసేలా వివరించాలన్నారు ,త్వరలోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏబిసిడి వర్గీకరణను వెలువరించే అవకాశాలు ఉన్నాయని జిల్లాలో జరిగిన సమావేశంలో చర్చించారు, మండలంలోని అన్ని గ్రామాల నుండి భవన కార్మికుల సమ్మేళన సభకు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధ సంఘాల నాయకులు అందరూ తప్పుకు హాజరుకావాలని సభను జయప్రదం చేయాలని బాబురావు మాదిగ కోరారు,

## డిగ్రీ కాలేజీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



పొదిలి, మేజర్ న్యూస్ : పట్టణంలోని ఎస్ వి కె పి డిగ్రీ కళాశాల నందు పూర్వపు విద్యార్థి అయిన ఎస్ ఐ జి కోటయ్య విద్యార్థిని, విద్యార్థులకు శుక్రవారం పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ మరియు మాదకద్రవ్యాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. అదే విధంగా మంచి భవిష్యత్తు కోసం ఒక గమ్యాన్ని ఏర్పాటు చేసుకొని విద్యార్థులు అభివృద్ధి చెందాలని సూచించారు. సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని చుట్టుపక్కల ఉన్న స్నేహితులకు మరియు గ్రామస్తులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## దాసరిపల్లెలో మధ్యాహ్న భోజనం తనిఖీ



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని దాసరిపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని మండల తాసిల్దార్ కొంగలవీటి కిషోర్ కుమార్ రెడ్డి శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు కాటేపల్లి చిన ఆవులయ్య, పాల్గొన్నారు.

## రామాలయంలో మొక్కలు నాటిన బిజేపీ నేతలు

అద్దంకి, మేజర్ న్యూస్: "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా అద్దంకి మండలం లోని మోదేపల్లి గ్రామం లో గల రామాలయం లో మొక్కలు నాటే కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్యంగా దేవాలయ ఆవరణలో ఉసిరి, గులాబీ వంటి పలు పండ్ల, పూల రకాల మొక్కలు నాటారు.ఈ కార్యక్రమం మోదేపల్లి శక్తి కేంద్రం ఇంచార్జ్ మా రెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

## జె ఎన్ టి యు కె నూతన ఇంచార్జ్ వైస్ ఛాన్స లర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బెల్లంకొండ అధినేతలు



పొదిలి ,మేజర్ న్యూస్ : జవహర్లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ నూతన ఇంచార్జి వైస్ ఛాన్సలర్ గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కె వి ఎస్ జి మురళీ కృష్ణ ను బిట్స్ బెల్లంకొండ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, బెల్లంకొండ విజయలక్ష్మి లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అకడమిక్ విషయాల పై వారు చర్చించారు. ఈ సందర్భంగా వీసి రచించిన ద టీచర్, బికమింగ్ జీనియస్ తదితర పుస్తకాలను బెల్లంకొండ కళాశాల అధినేతలకు ఆయన బహుకరించారు.

## కౌలు రైతులకు ప్రభుత్వం పెద్దపీట

### కౌలు కార్డులు అందజేసిన ఏవో జైనులాబ్దిన్



పొదిలి , మేజర్‌న్యూస్ : కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మండల వ్యవసాయ అధికారి షేక్ జైనులాబ్దిన్ అన్నారు. శుక్రవారం మండలంలోని 900 మంది కౌలు రైతులకు గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా కౌలు పత్రాలు అందజేశారు. గ్రామ వ్యవసాయ సంచాలకులు గ్రామస్థాయిలో కౌలు రైతులను గుర్తించి వారికి కౌలు కార్డు వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కౌలు కార్డులు పొందడం ద్వారా బ్యాంకుల ద్వారా కౌలు రైతులు రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా వచ్చు అన్ని సబ్సిడీలు, పంట నష్టపరిహారం, పంట బీమా ద్వారా వచ్చు నష్టపరిహారాలను అందుకోవచ్చు అని ఆయన తెలిపారు.